జిల్లాలో కొత్తగా 237 పోలింగ్ కేంద్రాలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో కొత్తగా 237 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగనుందని తెలిపారు. బూత్ లెవెల్ ఆఫీసర్ల నియామకాన్ని పూర్తిచేసి, ట్రైనింగ్ కూడా పూర్తి చేశామన్నారు. రాజకీయ పార్టీలు కూడా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకొని శిక్షణ ఇవ్వాలని సూచించారు. 1200కంటే ఎక్కువమంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించాలన్న చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో మొత్తం 2440 కేంద్రాలు అవుతాయన్నారు. డిఆర్ఒ వెంకటనారాయణమ్మ ,బిఎస్‌పి డిస్టిక్‌ఇంచార్జ్ అరుణ్‌కుమార్, టిడిపి నాయకులు ఎల్‌వి.ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు బజారన్న, ఎన్నికల విభాగం సూపరింటెన్‌డెంట్ మురళి హాజరయ్యారు.

కలెక్టర్ ప్రత్యేక పూజలు : సమాచార శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతికి జిల్లా కలెక్టర్ పిరంజిత్ బాషా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పాత్రికేయ ఉత్సవ గణపతి సమితి సభ్యులు కలెక్టర్‌ను సన్మానం చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె.జయమ్మ, ఉత్సవ కమిటీ సభ్యులు విద్యాసాగర్ ,శ్రీనివాసులు ,అవినాష్, విజయ్, నీలం సత్యనారాయణ, పరమేష్ శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష

ఉల్లి రైతు కంట కన్నీరు

- అధిక వర్షాలు.. పెరిగిన పెట్టుబడి... - తగ్గిన దిగుబడి.. దక్కని గిట్టుబాటు ధర...

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ముందుగా రావడంతో రైతులు మేనెలలో ఉల్లి సాగు ప్రారంభించారు. కర్నూలు నంద్యాల జిల్లాలలో దాదాపు 60 వేల ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. పులి పంట చేతికి వచ్చేసరికి వర్షాలు పడటంతో తడిసిన ఉల్లి కర్నూలులో మార్కెట్‌కు తీసుకురాగా కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యాపారంలో ఉల్లిని చూసి క్వింటాలుకు రూ.200 కూడా కొనకపోవడంతో రైతులు మార్కెట్‌లోనే వదిలి వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్క గురువారం కర్నూలు మార్కెట్‌కు వెళ్లి రైతులు అమ్మకాని తీసుకురాగా భారీగా ధర పతనం కావడంతో నాలుగు రోజులుగా ధరల కోసం వేచిచూసిన పరిస్థితి. ఉల్లి తేమతో ఉండడంతో వ్యాపారస్తులు కొనడానికి ముందుకు రావడం లేదు. క్వింటా రూ.వంద నుండి 400 వరకు మాత్రమే అమ్ముడు పోతుంది. ఉలికి ధర రాకపోవడంతో కొందరు రైతులు పొలంలోనే పశువులకు మేతగా వదిలివేస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో క్వింటాధర 2 రూ.వెయ్యి నుంచి 2000 ఉండేది. ప్రస్తుతం వెయ్యి రూపాయలు కూడా కొన్ని వారు లేరు. వ్యవసాయ మార్కెట్ అధికారులు ఇక్కడ పరిస్థితిని మాత్రులకు కలెక్టరుకు, ఉన్నతాధికారులకు విన్నవించారు. శుక్రవారం కలెక్టర్, ఎస్‌పి మార్కెట్‌ను సందర్శించి రైతుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్లగా ఉల్లి విషయమై మంత్రివర్గంతో సమావేశం నిర్వహించి చర్చించి క్వింటా రూ. 1200 కొనాలని ఆదేశించారు. శనివారం కూడా ఉల్లిని కొనేందుకు వ్యాపారాలు ముందుకు రాలేదు. 2500 క్వింటాళ్లు వరకు గురు శుక్రవారాల్లో వస్తే శనివారం కేవలం 1500 కింటాళ్లు మాత్రమే వచ్చాయి. మార్కెట్ యార్డ్ సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ లు కలిసి సమావేశాలు నిర్వహించి మార్కెట్ యార్డులోని పరిస్థితి జెడి రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు.

కర్నూలు మార్కెట్‌లో ఉల్లి గడ్డను చూపుతూ కన్నీరు పెడుతున్న రైతు

ఆటో బాడుగలు కూడా రావడం లేదు

- అయ్యన్న, మల్కాపురం గ్రామం

ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టి ఉల్లి పంట పండించి ఒక్కో పాకెట్‌కు రూ.50 చొప్పున ఆటో బాడుగ పెట్టి మార్కెట్‌కు తీసుకువస్తే ఇక్కడ బాడుగ కూడా వచ్చే పరిస్థితి లేదు. కనీసం రూ.20,000 వచ్చినా తీసుకొని వెళ్తానని ఆవేదనభరితంగా చెప్పాడు. ఉల్లి రైతులను ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి. లేనిచో అప్పుల వారికి ఏమీ ఇవ్వలేక ఊరు వదిలి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

క్వింటాకు రూ. 2 వేల ధర కల్పించాలి

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి

వర్షాలు కురుస్తుండడంతో మార్కెట్ వచ్చిన పంట తడిసి ఉండడం చేత వ్యాపారస్తులు కొనడానికి ముందుకు రావడం లేదు. రైతుల తెచ్చిన ఉల్లిని కనీసం రూ.500 కూడా కొనేవారు లేరు. మార్కెట్ యార్డ్ పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు కనీసం మద్దతు ధర రూ.2000 ఇచ్చి ఆదుకోవాలి. ఆమేరకు కలెక్టరుకు వినతి పత్రం ఇచ్చాం.

క్వింటా రూ.200లకు కూడా కొనడం లేదు

- వడ్డే సురేష్, పుల్లగుమ్మి గ్రామం

ఖరీఫ్‌లో రెండు ఎకరాల పొలంలో ఉల్లి పంటవేశా. ఉల్లినారుకు రూ.30000, ఉల్లి నాటడానికి రూ.40 వేలు, మందులకు రూ.12,000, తెలుగు క్రిమిసంహారక మందులకు రూ.పదివేలు, ఉల్లి పంట పెరగడానికి రూ.14,400, కోతకు రూ.16,000 ఖర్చు చేసి కర్నూలు మార్కెట్కు 86 సంచులు ఉల్లిగడ్డలు తెచ్చాను. కనీసం రూ.200 కూడా అడగటం లేదు. ధర ఇలా ఉంటే అప్పులు చేసి పండించిన ఉల్లికి ధర లేకపోతే మార్కెట్ నుండి ఖాళీ చేతులతో కన్నీళ్లతో ఇంటికి పోవాల్సి వస్తుంది.

కోత కూలి కూడా రావడం లేదు

- అలువాల రామకృష్ణ, గోనెగండ్ల మండలం

ఎకరా రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టి ఉల్లి పంట పండించాను. రూ.30,000 ఖర్చు చేసి కర్నూలు మార్కెట్‌కు ఉల్లిని తెస్తే రూ.100 నుండి రూ.150 కూడా అడగటం లేదు. దీంతో బయట హోటళ్లకు , నగరంలోఇండ్ల దగ్గరకు వెళ్లి రూ.200 పాకెట్ ఉల్లి అమ్ముకొని పోతున్నాం. రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి.

అంగన్వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు సిపిఎం కార్యాలయంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా స్థాయి వర్క్ షాపు యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.రేణుక అధ్యక్షతన నిర్వహించారు. సుబ్బారావమ్మ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో దాదాపు 42 రోజులు సమ్మె చేసినా, నాటి ముఖ్యమంత్రి జగన్ కనీసం హామీ కూడా ఇవ్వలేక పోయాడన్నారు. సమ్మె సందర్భంగా ప్రస్తుత కూటమి నాయకులు సమ్మె శిబిరాలు దగ్గరకొచ్చి అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 16 నెలలైనా పరిష్కరించడానికి ముందుకు రాలేదన్నారు. రకరకాల యాపులు తెచ్చి పని భారాన్ని పెంచడానికి సిద్ధపడుతున్నారన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా తనకేమి సంబంధం లేనట్లుగా ఉంటున్నారు. మరోపక్క ఈదేశ సంపదను అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికి వందేళ్ల క్రితం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్పు చేసి నాలుగు కోడ్‌లను అమలు చేయడానికి పూను కుంటుందన్నారు. లేబర్ కోడ్ల రద్దు కోసం సిఐటియు అఖిల భారత మహాసభలలో చర్చించి వాటి రద్దుకోసం జరిగే పోరాటాలో మనమందరం పాల్గొనాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల, కార్యదర్శి వెంకటమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణలు మాట్లాడుతూ... గత ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కారం పట్ల అశ్రద్ధ వహించి తగిన మూల్యం చెల్లించుకుందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలులో భాగంగా ఒక అడుగు కూడా ముందుకు వేయడం లేదన్నారు. పనిభారాన్ని విపరీతంగా పెంచారన్నారు. యాప్లను రద్దు చేయాలని ఆందోళనలు చేస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా వుంటుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. యూనియన్ జిల్లా నాయకులు బాలదుర్గమ్మ, శైలజ, ప్రభావతమ్మ, వరలక్ష్మి, ఎబిషారాణి, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావమ్మ

మాటల్లోనే యూరియా..!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రస్తుతం పంటల సాగుకు యూరియా ఎంతో అవసరం. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగు చేసిన ప్రతి పంటకూ యూరియా ఎంతో అవసరం. రైతులందరికీ యూరియా అందించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం విఫలమయింది. అధికారులు మాటల్లో చెబుతున్నా చేతల్లో రైతులకు యూరియా అందడం లేదు. ప్రయివేట్ ఎరువుల దుకాణాల యజమానులు కొరత బూచి చూపి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. రైతులకు యూరియాతో పాటు ఎరువులు, క్రిమిసంహారక మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అందుతున్నాయా లేదా అని అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. ప్రస్తుతం మార్కెట్లోకి వివిధ కంపెనీల పేరుతో నకిలీ క్రిమిసంహారక మందులు పక్క రాష్ట్రాల నుంచి వచ్చి చలామణి అవుతుండడంతో వాటిపై గట్టి నిఘా ఉంచి రైతులను రక్షించాల్సి ఉంది. వ్యవసాయ అధికారులు మామూళ్ల మత్తులో పడి చోద్యం చూస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. వ్యవసాయ అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులకు యూరియా కొరత ఏర్పడింది. ప్రయివేట్ డీలర్ల దగ్గర యూరియా స్టాక్ ఎంత ఉంది.. రైతులకు ఎంత మేర అవసరమవుతాయి.. జిల్లా అధికారులకు ఎంత ఇండెంట్ ఇవ్వాలని అంచనా లేకుండా వ్యవహరించడం వల్ల యూరియా కొరత ఏర్పడింది. ప్రయివేట్ డీలర్ల వద్ద ఏయే కంపెనీకి సంబంధించిన క్రిమిసంహారక మందులు ఉన్నాయి.. అవి నకిలీవా.. ఒరిజినలా గుర్తించి రైతులకు నష్టం జరగకుండా చూడాలి. ప్రతిసారీ రైతులు నకిలీ మందులు, నకిలీ విత్తనాలు కొని తీవ్రంగా నష్టపోవడం చూస్తున్నాం. భవిష్యత్తులోనైనా జిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి, రైతు రైతుగా బతికేలా చూడాలి.

సతాయించిన సర్వర్

రెండు రోజుల ఆలస్యం అనంతరం డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రక్రియ జరిగింది. సర్టిఫికెట్ల పరిశీలనకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో అభ్యర్థులు విసుగెత్తిపోయారు. సర్వర్ వచ్చినప్పటికీ సరిగ్గా పనిచేయకపోవడంతో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేసేందుకు నిర్వహణ అధికారులు తీవ్ర అవస్థలు పడ్డారు. మరి కొంతమంది అభ్యర్థులు పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకోకపోవడంతో నిరాశకు గురయ్యారు. కర్నూలు నగర శివారులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో, శ్రీనివాస బిఇడి కళాశాల, శ్రీరాఘవేంద్ర డిఇడి కళాశాలలో డిఎసిపి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. దాదాపు 250 మంది ఉపాధ్యాయులను 54 బృందాలుగా ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా మధ్యాహ్నం 1 గంట అయినప్పటికీ ప్రారంభం కాలేదు. సర్వర్ ఓపెన్ అయినా అభ్యర్థుల వివరాల పరిశీలనకు మాత్రం ఎక్కువ సమయం పడుతుండడంతో నిర్వహణ అధికారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు మే 15 నాటికి కోర్సు పూర్తి చేసుకున్నప్పటికీ 21న సర్టిఫికెట్లను జారీ చేయడం పట్ల వెరిఫికేషన్ అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. ఉపాధ్యాయ సంఘాల నేతలు జోక్యం చేసుకొని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరి కొంతమంది అభ్యర్థులు పోస్టులకు అర్హత ఉన్నప్పటికీ కాల్ లెటర్స్ అందకపోవడంతో వెరిఫికేషన్ కేంద్రాలకు చేరుకున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పోస్టులకు ఎందుకు ఎంపిక చేయలేదని విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

సీజనల్ వ్యాధుల విజృంభణ

మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరం, నిమోనియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా, డయేరియా కేసులు పెరిగాయి. ఈ కేసులతో ఆస్పత్రులు, క్లినిక్స్ నిండిపోతున్నాయి. జిజిహెచ్ పిల్లల విభాగం ఒపిలో సాధారణ సమయంలో 150 నుంచి 200 ఒపిలు ఉంటే ప్రస్తుతం 250 నుంచి 300 దాకా పెరిగాయి. జనరల్ మెడిసిన్ విభాగంలో 300 ఒపిలలో సీజనల్ కేసులు 50 నుంచి 60 దాకా ఉన్నాయి. ప్రయివేట్ ఆస్పత్రులు, క్లినిక్స్‌లో వైరల్ ఫీవర్ రోగుల సంఖ్య ఎక్కువగానే ఉంది.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు , కళాశాల ప్రిన్సిపల్ నాగస్వామినాయక్

నేత్రదానం పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని కర్నూలు బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ నాగ స్వామి నాయక అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ సంధ్యా రెడ్డి ఆధ్వర్యంలో నేత్రదానం పట్ల అవగాహన కల్పించారు.ఆప్తామాలజి టెక్నీషియన్ పరమేశ్వర రెడ్డి, మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 350 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ తన నేత్రాలను దానం చేయడానికి అంగీకార పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ విజయశేఖర్, సోమేష్, సుజాత, ఉల్గోజి రావు, జసింత , విద్యార్థులు పాల్గొన్నారు.

గుండ్రేవుల మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి-సి బెళగల్ : గుండ్రేవుల మాజీ సర్పంచి జి.కృష్ణయ్య(68) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన 2008-2014 వరకు సర్పంచుగా సేవలు అందించారు. రాజకీయ నాయకులుగా రాణించి మండలంలో ముఖ్య నాయకులుగా ఎదిగారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కోలుకోలేక మృతి చెందారు. ఆయన మృతికి మాజీ సర్పంచులు రూతమ్మ, హనుమాన్ యాదవ్, వెంకటేష్ లు ప్రస్తుత సంఘాల సర్పంచు హనుమంతు తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

షైన్ ఆస్పత్రిలో గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు

ఎండి.గంగాధర్

ప్రజాశక్తి-పత్తికొండ : తమ ఆసుపత్రిలో గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని షైన్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ గంగాధర్ పేర్కొన్నారు. శనివారం పత్తికొండ షైన్ ఆస్పత్రిలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రజలకు 24 /7 గంటలు అందుబాటులో ఉండే విధంగా ఆస్పత్రి నిర్వహిస్తున్నా మన్నారు. గర్భిణీలకు సాధ్య మైనంత మేరకు సాధారణ కాన్పులను చేస్తున్నామన్నారు. ప్రసవ సమయంలో గర్భిణీలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా నెలనెల పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుజిత అనుభవంతో గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. చిన్న పిల్లలకు కూడా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. చిన్నపిల్లలకు వచ్చే జబ్బులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు ఉన్నాయన్నారు. పత్తికొండ పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆసుపత్రి ఉందన్నారు. మరింత సమాచారం కోసం 9202801086 సంప్రదించాలని కోరారు.

ఎమర్జెన్సీ వైద్యంపై ప్రత్యేక దృష్టి అవసరం

వైద్యులతో సూపరింటెండెంట్ సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఎమర్జెన్సీ విభాగపు వైద్యులు, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లతో క్యాజువాలిటీ కేసులు తదితర అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శనివారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ విభాగానికి వచ్చిన ప్రతి పేషెంట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. క్యాజువాలిటీ విభాగంలో ప్రతిరోజు రౌండ్స్ నిర్వహించి క్యాజువాలిటీ విభాగంలో ఉండే పేషెంట్లకు ఐవి, క్యాత్ , ఇన్వెస్టిగేషన్స్‌కు సంబంధించిన ప్రాపర్‌గా ట్రీట్‌మెంట్ అందే విధంగా చర్యలు చూసుకోవాలని క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లను నర్సింగ్ సిబ్బందికి ఆదేశించారు. ఎమర్జెన్సీ విభాగంలో అవుట్‌సైడ్ ఇన్వెసిగేషన్ పంపకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అవుట్ సైడ్ ఇన్వెస్టేషన్ పంపితే వారికి శాఖ పరమైనపైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ హాస్పిటల్ ఒపి ఐపి డిశ్చార్జ్, క్లినికల్ మాడ్యూల్ కేసులు అన్నిటి పర్ఫామెన్స్ పెంచి అన్ని కేసులు ఈ హాస్పిటల్లో నమోదయ్యేటట్టు చూసుకోవాలన్నారు. క్యాజువాలిటీ విభాగం నుంచి వచ్చే ఎమర్జెన్సీ కేసులు సంబంధిత విభాగాలు త్వరగా షిఫ్ట్ అయ్యే విధంగా చూసుకునే బాధ్యత డిఎపి , క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు (సిఎంఒ) బాధ్యతలు తీసుకునే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు. నైట్ టైంలో సర్‌ప్రైజ్ విజిట్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం విధుల్లో లేని వైద్యులు , ఆసుపత్రి సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. క్యాజువాలిటి విభాగంలో డ్యూటీ అసిస్టెంట్, డిఎపి ఫిజీషియన్, డిఎస్ సర్జన్, ఆర్తో, విధుల్లో ఉండేటట్లు చూసుకోవాలన్నారు, లేనియెడల వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో క్యాజువాలిటీ విభాగం ఎప్పుడు రద్దీగా ఉండే వేళల్లో డాక్టర్స్ అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రి క్యాజువల్టీ విభాగంలో డ్యూటీ అసిస్టెంట్స్ లేకపోతే తనకు సమాచారం ఇవ్వాలని, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్స్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీరాములు, ఇంచార్జ్ సిఎస్ఆర్ఎంఒ, డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ పద్మజ, ఎమర్జెన్సీ విభాగపు వైద్యులు డాక్టర్ రామ్ శివ నాయక్, డాక్టర్ సుబ్రహ్మణ్యం,క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు, ఆసుపత్రి ఎడి మల్లేశ్వరమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్, సావిత్రి బాయి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

ఎస్‌వి మోహన్ రెడ్డి నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డిని ప్రకటించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ కర్నూలు కొండారెడ్డి బురుజుపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను మరోసారి ఎగరేసేందుకు తాము కృషి చేస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ అన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా కర్నూలులో అన్ని వర్గాలను కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి తోపాటు ప్రజల కోసం పోరాటం చేస్తామని తెలిపారు. వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రానున్న కార్పోరేషన్ ఎన్నికల తోపాటు ఏడు నియోజకవర్గాల్లో పార్టీ విజయానికి పోరాడుతామని తెలిపారు. వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షులు ఎస్. షరీఫ్, అక్కిమి హనుమంత్ రెడ్డి , పటేల్ హనుమంతు రెడ్డి , కిషన్, రాఘవేంద్ర నాయుడు, లాజర్, గోల్డ్ శీను, బుల్లెట్ అంజి, సలీం భాయ్, ఫిరోజ్, బబ్లూ, రవి, కంటూ, పరశురాం, యేసు, శివ, వస్తాద్ తదితరులు పాల్గొన్నారు.

విభాగాల మధ్య సమన్వయం అవసరం

-మున్సిపల్ షాపులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

-బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో సమస్యల పరిష్కారానికి విభాగాల మధ్య సమన్వయం తప్పనిసరి అని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ అధికారులను హెచ్చరించారు. శనివారం ఆయన పెద్ద మార్కెట్, వినాయక ఘాట్‌వద్ద మున్సిపల్ దుకాణాలు, పరిసర ప్రాంతాలు, కింగ్‌మార్కెట్ కమ్యూనిటీ హాల్, కిడ్స్ వరల్డ్‌వద్ద డ్రైనేజీ కాలువ ఓవర్‌ఫ్లో సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో అవసరమైన మరమ్మతు పనులను ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న షాపుల పరిస్థితిని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తరచూ పర్యవేక్షించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వీడి, ప్రజాసేవలో బాధ్యత, చిత్తశుద్ధి, నిబద్ధతతో వ్యవహరించాలని కమిషనర్ అధికారులను సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, ఆర్ఒ జునైద్, సిబ్బంది అనిల్, సుహైల్, రాజు, మన్సూర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ, తదితరులు

గణేష్ నిమజ్జనంలో అపశృతి

విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

ప్రజాశక్తి- సి బెళగల్

వినాయక నిమజ్జనం వేడుకల్లో శుక్రవారం అపశృతి చోటుచేసుకొంది. సిబెళగల్ దాసరి వీధికి చెందిన లక్ష్మీదేవి, రుద్రయ్య దంపతుల కుమారుడు చందు (17) విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. నిమజ్జనంలో రాత్రి సిబెళగల్ చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ ట్రాక్టర్ పై నున్న విద్యుత్ తీగలు విగ్రహానికి తగిలాయి. ట్రాక్టర్ పై నున్న 10 మందికీ షాక్ కొట్టింది. ఆసుపత్రికి తరలించగా ప్రాణప్రాయ స్థితిలోనుండి తొమ్మిది మంది బయటపడ్డారు. చందు యువకుడు మాత్రం పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రభుత్వాసు పత్రిలో మృతి చెందారు. ఒక్కగానొక్క కుమారుడు కుటుంబానికి అండగా ఉంటాడని తల్లిదండ్రులకు అందనంత దూరానికి వెళ్లిపోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

ఒకే రోజు ముగ్గురు మృతి : సి బెళగల్ లో నిమజ్జనంలో అపశృతి కారణంగా యువకుడు చందు (17)మతి చెందారు.. సెక్షావాలి (36) భార్య పుట్టినిల్లు ఎర్రకోటకు వెళ్ళింది..మరో రోజు సిబెళగల్‌కు వస్తానని భార్య చెప్పి పంపగా మార్గమధ్యలో అనుమానాస్పదంగా మృతి చెందారు. సిబెళగల్ ఎస్‌సి కాలనీలో మాణిక్యం (65) అనారోగ్యంతో మృతి చెందారు. ఇలా ఒకే రోజు ముగ్గురి అంత్యక్రియలు జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి..

రేపు కలెక్టరేట్లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సోమవారం ఉదయం 10 గంటలకు కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్నిమండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వ్యాధినిరోధక టీకాల స్టాక్ తనిఖీ చేసిన డిఐఒ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.నాగప్రసాద్ బాబు శనివారం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా వారు పిహెచ్‌సిలోని శీతలీకరణ యంత్రాలు , ఐఎల్ఆర్, డీ ఫ్రీజ్‌లను పరిశీలించారు. వ్యాధినిరోధక టీకాల స్టాక్ గురించి అడిగి తెలుసుకొని స్టాక్‌ను చెక్ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పిహెచ్‌సి, యుపిహెచ్‌సి , ఆసుపత్రి పరిధి లో గర్భవతులకు, చిన్న పిల్లలకు కావాలసిన అన్నీ రకాల వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో వున్నాయని తెలిపారు. ఎక్కడ కూడా కొరత లేవని అన్నారు. ఈ టీకాలును ప్రభుత్వం ఉచితంగా వేస్తుందన్నారు. గర్భవతులకు, పిల్లలకు సమయాను సారంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయంలో వేయించుకోవాలన్నారు. అన్నీ రికార్డ్సను పరిశీలించి తగు సూచనాలు చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కరుణ, డిప్యూటీ డెమో చంద్ర శేఖర్ ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కష్టం 'దిబ్బ' పాలు

- ధర లేక పారబోసిన వైనం

ప్రజాశక్తి - కోసిగి

ఉల్లి రైతు కష్టం 'దిబ్బ' పాలయింది. ఉల్లికి గిట్టుబాటుధర లేకపోవడంతో రైతులు ఉల్లి పంటలను దిబ్బకు తోలారు. ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కోసిగి గ్రామానికి చెందిన రైతులు జక్కనగేని పెద్ద ఈరన్న, చిన్న ఈరన్న, కేశవులు, తిరుమల వారివర్ద ఆరెకరాల పొలంలో ఉల్లి పంటను సాగు చేశారు. ఉల్లి క్వింటా రూ.300 నుంచి రూ.600 ధర పలకడంతో ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి పంటలు పండించిన రైతుకు ధరల రూపంలో, ప్రకృతి రూపంలోనూ కష్టాలు తప్పడం లేదు. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టామని, పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు వాపోయారు. శనివారం ట్రాక్టర్ ద్వారా ఉల్లి పంటను తీసుకెళ్లి ఊరి బయట ఉన్న దిబ్బలో పారబోశారు. అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దిబ్బ తిన్నప్పటికీ అప్పు చేసి మందులు స్ప్రే చేశారు. ఉల్లి ధరలు పూర్తిగా తగ్గడంతో వాపోయారు. అధికారులు, ప్రభుత్వాలు స్పందించి ఉల్లి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

గిట్టుబాటు లేక పంటను దిబ్బకు తోలుతున్న రైతు

నిర్మాణ పనులు మొదలు పెట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ప్రజాధనంతో నిర్మిస్తున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు మొదలు పెట్టకుండా అడ్డుకోవడం పాలకులకు తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ విమర్శించారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ మైదానంలో అసంపూర్తిగా ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.33 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అసంపూర్తిగా ఉందన్నారు. కాంప్లెక్స్ పూర్తయితే మున్సిపాలిటీ ఆదాయంతో పాటు పలువురికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే పనులకు ఆటంకం కల్పిస్తున్నారని మండిపడ్డారు. మురుగునీటి కుంటగా మారి ప్రజాధనం నీళ్ల పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను అధికారులు వెంటనే ప్రారంభించాలని, లేకపోతే డిపాజిట్ చెల్లించిన వారితో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు వెంకటేశులు, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ వేలం హోరాహోరీ

- రూ.89.40 లక్షలు పలికిన పాట

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో టమోటా, కూరగాయల మార్కెట్ వేలం హోరాహోరీగా జరిగింది. ఎంపిడిఒ గీతా వాణి ఆధ్వర్యంలో సర్పంచి శ్రీనివాసులు అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. సర్కారు వారి పాట రూ.62 లక్షలతో ప్రారంభించిన వేలం చివరికి బాట తిక్కయ్య రూ.89.40 లక్షలకు దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో బాట తిక్కయ్య, బాట వీరేష్, గిత్త నల్లన్న, చింతమాను కృష్ణ, చాకలి బాల రంగుడు వేలం పాటలో పాల్గొన్నారు. గతేడాది రూ.60.86 లక్షలు పోగా ఈసారి రూ.89.40 లక్షలు పలికింది. వేలంలో 25 శాతం రూ.22.35 లక్షలు గ్రామాభివృద్ధికి తీసివేయగా రూ.67.05 లక్షలు పంచాయతీకి చెల్లించాలని తెలిపారు. వేలం పాటలో ఎలాంటి గొడవలూ జరగకుండా సిఐ గంగాధర్ 20 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. డిప్యూటీ ఎంపిడిఒ విజయ భాను, పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు, విజయ రాజు, సురేష్, వెంకటేష్, మాజీ ఎంపిపి వెంకటేష్, గ్రామ పెద్దలు పెద్దయ్య, మహేష్ పాల్గొన్నారు.

వేలం పాట నిర్వహిస్తున్న ఎంపిడిఒ గీతావాణి

వైసిపి కౌన్సిలర్ల మధ్య సఖ్యత కరువు

- దుకాణాల కేటాయింపుల్లో వివాదం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ కౌన్సిల్‌లో వివాదం నెలకొంది. ఇన్నేళ్లు సఖ్యతగా ఉన్న వైసిపి కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో గందరగోళం నెలకొంది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఎక్స్ అఫిషియో సభ్యులు, ఎమ్మెల్సీ బీటీ.నాయుడు మొదటిసారి హాజరయ్యారు. చైర్మన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ, వైస్ చైర్మన్లు నరసింహులు, మున్వర్ గౌస్, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రఘునాథరెడ్డి, చలపతి బీటీని శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు. కౌన్సిలర్ ఇందు మాట్లాడుతూ... ఆదోని అభివృద్ధికి నిధులు తెచ్చామని, అభివృద్ధి పనులకు వైసిపి కౌన్సిలర్లు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే పార్థసారధి చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జనరల్ ఫండ్ కింద నిధులు వచ్చాయని, ప్రత్యేకంగా ఏమీ లేదని కమిషనర్ చెప్పారు. ఎమ్మెల్యే ఏ సందర్భంలో చెప్పారో తమ వద్ద రికార్డులు లేవని వివరించారు. ఎమ్మెల్యేగా నిధులు విడుదల చేయించలేదోగాని వైసిపిపై నిందలు వేయడం తగదని కౌన్సిలర్ సందీప్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.

వైసిపి కౌన్సిలర్ల మధ్య వివాదం

పట్టణంలో మున్సిపల్ దుకాణాల అద్దె కోసం ఇటీవల టెండర్లు నిర్వహించారు. దుకాణాల అద్దె పాట దక్కించుకున్న వారి వివరాలను ఆమోదించాలని అజెండాలో అధికారులు పొందుపరిచారు. ఆ అంశాన్ని ఆమోదించాలని కోరగా టెండర్ల వ్యవహారంలో అనుమానాలు ఉన్నాయని, ఆమోదించకుండా వాయిదా వేయాలని కౌన్సిలర్ సందీప్ రెడ్డి, బాలాజీ తెలిపారు. నిబంధనలకు లోబడి టెండర్ల ప్రక్రియ కొనసాగిందని, పాట దక్కించుకున్న వారికి అధికారులు ఏం సమాధానం చెబుతారని, ఆమోదించాలని వైస్ చైర్మన్ నరసింహులు కోరారు. చైర్మన్ లోకేశ్వరి కలుగజేసుకొని ఆ అంశాన్ని వాయిదా వేయాల్సిందేనని, విచారణ చేయించి వచ్చేనెల సమావేశంలో ఆమోదం తెలుపుతామని చెప్పడంతో ఒకరిపై ఒకరు మండిపడ్డారు. వాయిదా వేయడం వల్ల మున్సిపాలిటీకి నష్టమని వైస్ చైర్మన్ నరసింహులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా కౌన్సిలర్లు ఒప్పుకోకపోవడంతో వాయిదా పడింది. దుకాణాల టెండర్ల వ్యవహారం గురించి తమ వద్ద పూర్తి సమాచారం లేదని చైర్మన్ లోకేశ్వరి చెప్పడంతో వైస్ చైర్మన్ నరసింహులు మధ్య మాటామాట పెరిగింది.

వార్డులో ఒక్క అభివృద్ధి పని జరగలేదు

టిడిపి కౌన్సిలర్‌నని తన వార్డులో నాలుగున్నర ఏళ్ల నుంచి ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని ఒకటో వార్డు కౌన్సిలర్ పార్వతి వాపోయారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలంటూ ప్రశ్నించారు.

పనులు చేపట్టేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా పైపులైను పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని చైర్మన్ లోకేశ్వరి తెలిపారు. అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని వాపోయారు. సమావేశాలు నిర్వహించి కాంట్రాక్టర్లకు నచ్చజెప్పినా ముందుకు రావడం లేదని తెలిపారు. బిల్లులు రావడం లేదని అప్పుల పాలవుతున్నామని కాంట్రాక్టర్లు చెబుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వంతో మాట్లాడి బిల్లులు సకాలంలో వచ్చేలా చూడాలని ఎమ్మెల్సీ బీటీని కోరారు. కౌన్సిలర్లు హసీనా బేగం, లక్ష్మీదేవి, చలపతి, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్లు రామ్మూర్తి, చలపతి, గోపీనాథ్, హెల్త్ ఆఫీసర్ సందీప్, టిపిఒ బాలమద్దయ్య, అకౌంట్ ఆఫీసర్ రవికుమార్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ హరినాథ్, రవి ఉన్నారు.

ఆదోని అభివృద్ధికి కృషి

ఆదోనిలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు తెలిపారు. ఆదోని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని చైర్మన్ లోకేశ్వరి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు బీటీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆదోని ప్రజల దాహార్తి తీర్చే బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు మరమ్మతుల కోసం రూ.70 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారని తెలిపారు. సెప్టెంబర్ రెండో వారంలో అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుపెట్టిన టిడ్కో ఇళ్ల కోసం కేబినెట్‌లో బడ్జెట్ కేటాయించినట్లు, త్వరలోనే లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ఇళ్లను అప్పజెప్పనున్నట్లు తెలిపారు. ఆదోని పాత ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో కేంద్ర రైల్వే మంత్రిని కలిసి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. నూతనంగా జిల్లా ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది, ఆదోనిని జిల్లా కేంద్రంగా ప్రకటించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్ర బాబు నిధులు కేటాయించే అవకాశం ఉందని చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమలయితే ఆదోనిలో ట్రాఫిక్ సమస్య తీరుతుందని తెలిపారు. పట్టణంలో ఓటరు జాబితాలో తప్పులున్నాయని మున్సిపల్ కౌన్సిలర్లు తన దృష్టికి తెచ్చారని, సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటీ

మాట్లాడుతున్న కౌన్సిలర్లు, వైస్ చైర్మన్

అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి సర్వే నెంబర్లు 251/1, 251/3లో 2018లో ప్రభుత్వం 1.60 ఎకరాల భూమిని కేటాయించింది. భవన నిర్మాణం చేపట్టేందుకు నిధుల కేటాయింపు విషయంలో కమిటీ సభ్యులు సంబంధిత అధికారులకు విన్నవించారు. కలెక్టర్ రంజిత్ బాషా సాంఘిక సంక్షేమ శాఖ డిపిఆర్ మేరకు ప్రణాళిక సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ శాఖను ఆదేశించారు. శనివారం శాఖ ఇంజినీర్ జయన్న అంబేద్కర్ భవన సాధన కమిటీ సభ్యులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. రూ.50 లక్షలతో భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. అంబేద్కర్ భవన సాధన కమిటీ ఛైర్మన్ కదిరికోట ఆదెన్న మాట్లాడుతూ... అంబేద్కర్ భవన స్థలాన్ని ఆరేళ్ల సుదీర్ఘ పోరాటంతో సాధించినట్లు తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షులు ఎస్.దేవ సహాయం, సభ్యులు జి.ఆనంద్ చైతన్య మాదిగ, రుద్రాక్షల పెద్దయ్య, ఎల్ఐసి పరిగెల భాస్కర్, ఎరుకల కృష్ణ, ఆరెకంటి భాస్కర్, రుద్రాక్షల దస్తగిరి, కనకవీడు రాజు, ఆర్ అండ్ బి ప్రభు కుమార్, రోజా ఆర్ట్స్ ఉసేని, కూలూరు ఇసాక్, పొనకలదిన్నె లక్ష్మన్న, సోమల గూడూరు రాజు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న జయన్న

నిమజ్జన వేడుకలు ప్రశాంతం : ఎస్ఐ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించి చైతన్యం కల్పించామన్నారు. ఏ గ్రామంలోనూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసినందుకు మండలంలోని ప్రజలందరికీ, ముఖ్యంగా యువతకు ధన్యవాదాలు తెలిపారు. యువతలో చాలా మార్పు కనిపించిందని తెలిపారు. పోలీసులు షబ్బీర్, ఖాదర్ వలీ, సుబ్రహ్మణ్యం, శంకర్ పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాటం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి-ఆలూరు

కార్మిక హక్కులను కాలరాస్తూ 44 చట్టాలను 4 లేబర్ కోడ్‌లకు కుదించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా.. కార్మిక హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. శనివారం ఆలూరు మండల సిఐటియు 7వ మహాసభలు వీరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభనుద్దేశించి అంజిబాబు మాట్లాడారు. కార్మికులు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు యజమానులకు చాటర్ ఆఫ్ డిమాండ్స్ (డిమాండ్ నోటీసు) ఇవ్వడానికి కూడా అనుమతులు ఇవ్వని విధంగా చట్టాలను మారుస్తున్నారని తెలిపారు. రాజస్థాన్‌లో ఒక యూనియన్ డిమాండ్ నోటీసు ఇస్తే 23 రోజులు నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను దొడ్డిదారిన రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయించాలని చూస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంపు, రాత్రిపూట మహిళలతో పని చేయించడం వంటి విధానాలకు తెరలేపుతోందని తెలిపారు. అనంతరం సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కెపి.నారాయణ స్వామి, కో కన్వీనర్‌గా వీరేష్, అనిత, 16 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, సిఐటియు మండల కో కన్వీనర్ షాకీర్, కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంజిబాబు

చదువుతోనే అభివృద్ధి

- ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ
- డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సన్మానం

ప్రజాశక్తి - దేవనకొండ

చదువుతోనే అభివృద్ధి చెందుతారని ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో మెగా డీఎస్సీలో 8 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా శనివారం వారిని సన్మానించారు. మెగా డీఎస్సీలో ఎంపికైన రాజేశ్వరి, శ్రీరాములు, మర్యాద రామకృష్ణ, అయేషా, రామానాయుడు, మల్లేష్, రామాంజనేయులు, ఉపేంద్ర గౌడ్‌ను, 2018 డీఎస్సీలో శ్రీరాములు, బడే సాబ్‌ను, వారి తల్లిదండ్రులను శాలువా, పూలమాలలతో రవికృష్ణ, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, సర్పంచి చెన్నమ నాయుడు, గ్రామ పెద్ద మల్లికార్జున సన్మానించారు. వెల్దుర్తి ఎఒ అక్బర్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవికృష్ణ మాట్లాడారు. గ్రామస్తులు మద్యపానానికి దూరంగా ఉండాలని, సంపాదించే ప్రతి పైసా ఆదా చేసి పిల్లల చదువులకు ఉపయోగించాలని తెలిపారు. వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత పిల్లలను వెంట వలసలకు తీసుకెళ్లకుండా పాఠశాలలోనే ఉండేలా తల్లిదండ్రులు కృషి చేయాలని చెప్పారు. గ్రామం నుంచి ఐఎఎస్, ఐపిఎస్‌కు ఎదిగి గ్రామ కలను నెరవేర్చాలన్నారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు మాట్లాడుతూ... ఎస్పీగా పనిచేస్తున్న సమయంలో గ్రామాన్ని దత్తత తీసుకున్న ఈగల్ ఐజి రవి కృష్ణ అభివృద్ధి చేసి గ్రామ రూపురేఖలు మార్చారని తెలిపారు. ఆయనను స్ఫూర్తి తీసుకొని ఆయన సూచనలు, సలహాలతో క్రమశిక్షణతో చదివి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యామని చెప్పారు. రవి కృష్ణ పుట్టినరోజు సందర్భంగా గ్రామస్తుల సమక్షంలోనే కేక్ కట్ చేశారు. ఎంపిటిసి రూపమ్మ, సేవ్ ట్రీస్ కోఆర్డినేటర్ నారాయణ, పెద్దలు ఎల్ఐసి రాజు, గొర్ల సుంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులుగా ఎంపికైన కప్పట్రాళ్ల వాసులకు సన్మానం

దశమి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో శ్రీచింతల ముని నల్లారెడ్డి స్వామి వారి దశమి ఉత్సవాలు సెప్టెంబర్ 12 నుంచి జరగనున్నాయి. వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త భాస్కర్ల చంద్రశేఖర్‌ను గ్రామస్తుల తరపున సర్పంచి పూజారి హైమావతి, అడ్వకేట్ పూజారి చంద్రశేఖర్ దంపతులు శనివారం ఎమ్మిగనూరుకు వెళ్లి ఆహ్వానించారు. టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, గ్రామ అధ్యక్షులు మహాల్ రహంతుల్లా, మాజీ సర్పంచి రంగముని నాయుడు, మేకల మునెప్ప, డ్రామా కౌలుట్లయ్య, ఎన్‌వి.బాబు నాయుడు, పోలకల్ వెంకటేశ్వర్లు, గౌవుండా రహంతుల్లా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న సర్పంచి దంపతులు

కబడ్డీ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - హోళగుంద

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆదోనిలో వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన వివిధ ఆట పోటీల్లో హోళగుంద విద్యార్థినులు ప్రతిభ చాటారు. కబడ్డీలో 12 జట్లు పాల్గొనగా విద్యార్థినులు మొదటి స్థానం సాధించారు. 4x100 మీటర్ రిలే బాలికల విభాగంలో మూడో స్థానం, 4x400 మీటర్ రీలే విభాగంలో రెండో స్థానం, 400 మీటర్‌లో యశోద రెండో స్థానం సాధించారు. 100 మీటర్, 400 మీటర్‌లో రన్నింగ్ దేవేంద్ర అనే విద్యార్థి 3, 2వ స్థానం సాధించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు కబీర్ సాబ్, విద్యా కమిటీ ఛైర్మన్ ద్వారకనాథ్, పీడీ మాబాష శనివారం అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది

రోడ్డు నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం

- మొక్కలు నాటి ఎస్ఎఫ్ఐ, పిఎస్‌యు నిరసన

ప్రజాశక్తి - నందవరం

నందవరం ప్రభుత్వాస్పత్రి ముందు రోడ్డు నిర్మాణం చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, పిఎస్‌యు జిల్లా కార్యదర్శి సురేష్ విమర్శించారు. ప్రభుత్వాస్పత్రి ఎదురుగా దుర్భరంగా ఉన్న రోడ్డుపై శనివారం మొక్కలు నాటి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన వారు రోడ్డు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. లోపలికి వెళ్లే ప్రధాన రహదారికి భారీ గుంత ఏర్పడి నీరు నిలిచి బురద మయంగా మారిందని చెప్పారు. గర్భిణులు, వికలాంగులు, వృద్ధులు రోడ్డు దాటలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. కొంతమంది వెనుదిరిగి వెళ్తున్నారని చెప్పారు. ప్రజలకు ఆరోగ్యాన్ని అందించే వైద్యాలయమే బురద, మురుగునీరు, దోమలతో అనారోగ్యాన్ని కలిగిస్తోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాల సంరక్షణకు ఏర్పాటు చేసిన ఆస్పత్రికి రోడ్డును నిర్మించడంలో అధికారుల నిర్లక్ష్యం వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలిక గ్రావెల్ వేసి తర్వాత సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

మొక్కలు నాటుతున్న నాయకులు

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

- ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - కోసిగి

గ్రామంలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు రాముడు, రామకోటి, హనుమంతు, వీరేష్, నాగేంద్ర కోరారు. శనివారం వారు కోసిగిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షానికి రోడ్లలో గుంతలు ఏర్పడి, వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, నడిచి వెళ్లేవారు ఎటు వెళ్లాలో అర్థంకాక ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. పంచాయతీ కార్యాలయం దగ్గర, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గర, రైల్వే గేట్ అవతల వైపు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని చెప్పారు. చాప వంక దగ్గర గుంతలు ఏర్పడి వర్షపు నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కోసిగయ్య తేరు బజారులో చిన్నపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారుతోందన్నారు. తేరుబజారు ఆవరణంలో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని, దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బ్రహ్మయ్య, నాగరాజు, నరసింహమూర్తి, బసవరాజు, ఈరన్న, హరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

NAME CHANGE

I, **Abdul Khaliq K** S/o **Kondapur Abdul Hakeem**, R/o H No:18-203 Gonegalla Road, Yemmiganur, Kumool Andhra Pradesh- 518360, have changed my name and shall hereafter be Known as **Kondapur Abdul Khaliq**

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE ADONI INSOLVENCY PETITION NO.17/2022

Between
Thipple Dhanunjaya S/o T.Ramulu,
Hindu, aged about 44 years, unemployed,
resident of 21/3/52, Near Satyanarayana
Temple, SKD Colony, Adoni - 518301
Cell No.9908644923,
Aadhaar No.480491946684. ...Petitioner

V/s

Akuthota Krishna Kishore and 12 others and to whomsoever it may be concern. ...Respondents

//As per the Hon'ble Court Orders//
General Notice

S.No. Name of Debtors
1. Akuthota Krishna Kishore,
2. Akuthota Abhimanyu Kumar,
3. Shaik Murtuza Vali @ Poola Basha,
4. Katike Maulali,
5. Smt. Nagamma,
6. Arvind
7. Sangi Mangamma @ Pala Mangamma,
8. Sangi Radhamma
9. Janapalli Sudhakar Reddy
10. Tupakula Kullayamma
11. Tupakula Pushpavathi
12. Thippala Maddiletamma
13. Thippala Venkatamma. ...Respondents

Petitioner Assessts: Two pairs of Pants and shirts.

Whereas the above named petitioner has filed Insolvency petition under Section 10 of Provincial Insolvency Act to declare the petitioner as insolvent against the respondent no.1 to 13, apart from that if anybody has got any wants (dues) or any objection with regard to the above petition I.P.No.17/2022 are hereby direct to appear in person before this Hon'ble Court on 11-09-2025 at 10-30 AM and answer the said Insolvency petition either personal or through Advocate, otherwise the petition will be decided on merits.

K.Venkataswamy,
Advocate for Petitioner,
Adoni
Cell No.8790483779

ఖాదర్ బాషను సన్మానిస్తున్న అధికారులు

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం

- పంచాయతీ రాజ్ డిఇ రంగస్వామి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజమని మంత్రాలయం డివిజన్ పంచాయతీరాజ్ డిఇ రంగస్వామి తెలిపారు. పెద్దకడుబూరు మండలంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖాదర్ బాష విరమణ పొందారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో విరమణ కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ... పంచాయతీ రాజ్ ఎఇగా ఖాదర్ బాష విధుల పట్ల నిబద్ధతతో పనిచేశారని, పంచాయతీరాజ్ శాఖ సిబ్బందితో స్నేహభావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షించారని తెలిపారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఆదోని పంచాయతీరాజ్ డిఇ రాణి, చిప్పగిరి ఎంపిడిఒ అల్లా బకాష్, కోసిగి ఎఇలు మాలిక్, వెంకటేశ్వర్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు గౌస్, విశ్రాంత ఎంఇఒ శివరాములు, కాంట్రాక్టర్ నరసింహ మూర్తి, టిడిపి పెద్దకడబూరు నాయకులు రమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని సిద్ధాపురం గ్రామానికి చెందిన బసవన్న గౌడ్(53) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందారు. బంధువుల వివరాల మేరకు... వజ్రకరూరు దగ్గర హంద్రీనీవా కాలువలో పడి బసవన్న గౌడ్ మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

దొరబాబు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - గోనెగండ్ల

పరామర్శిస్తున్న బుట్టా

వైసిపి బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు నాయుడును మాజీ ఎంపీ బుట్టా రేణుక దంపతులు శనివారం పరామర్శించారు. దొరబాబు నాయుడు తల్లి బోయ నాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బుట్టా రేణుక, ఆమె భర్త వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ శనివారం దొరబాబు నాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. బోయ నాగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగ కార్యదర్శి కాశిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ మన్సూర్, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, పొట్టపాశం మాజీ సర్పంచి గంగాధర్, నగేష్, ఖాజా, రఘు, సైకిల్ షాప్ రాముడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర కీలకం

ప్రజాశక్తి - నందవరం

ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర కీలకమైందని టిడిపి నాయకులు, సొసైటీ ఛైర్మన్ ధర్మపురం గోపాల్, టిడిపి మండల అధ్యక్షులు ఖాసింవలీ తెలిపారు. నూతనంగా ఏర్పాటయిన మండల ప్రెస్ కమిటీ సభ్యులతో శనివారం సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షులు ఎ.గోవిందు, కార్యదర్శి బి.కుమార్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడే విధంగా కథనాలు రాసి సమాజాభివృద్ధికి ప్రెస్ కమిటీ కృషి చేయాలని తెలిపారు. సొసైటీ డైరెక్టర్ భీమశేఖర్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, షరీఫ్, సురేందర్ రెడ్డి, లక్ష్మీకాంత్, నాగలదిన్నె రవి గౌడ్, గౌస్, ప్రెస్ కమిటీ ట్రెజరర్ భీమన్న, భీమశేఖర్, నాగేష్ పాల్గొన్నారు.

'ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి'

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించినప్పుడే గుర్తింపు ఉంటుందని, ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి అని వక్తలు తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు హంపయ్య విరమణ నిర్వహించారు. టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, పాఠ శాల విద్యా కమిటీ ఛైర్మన్ మడ్డి నరసింహ, ఎంఇఒలు మొయినుద్దీన్, రాఘన్న హాజరయ్యారు. ముందుగా విరమణ పొందుతున్న హంపయ్య, ఆయన సతీమణికి శాలువా, పూలమాలలు వేసి, రాఘవేంద్రస్వామి చిత్రపటాన్ని ఇచ్చి సన్మానించారు. హంపయ్య దంపతులను ప్రధాన రహదారి గుండా రాఘవేంద్రస్వామి మఠం వరకు ఊరేగించారు. ఉపాధ్యాయులు విఠోబరావు, చంద్రశేఖర్, రవీంద్ర, నరసింహ రాజు, టిడిపి నాయకులు మడ్డి శివకుమార్ పాల్గొన్నారు.

వినాయకుని దర్శించుకున్న ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని తుంగభద్ర, కాచాపురం గ్రామాల్లో కొలువుదీరిన వినాయకులను వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి దర్శించుకున్నారు. వినాయక మిత్రమండళ్ల సభ్యుల ఆహ్వానం మేరకు గ్రామాలకు చేరుకున్న ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. గణనాథులకు పూజలు చేసి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు ఆయనకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. వైసిపి నాయకులు దశరథ రెడ్డి ఉన్నారు.

Greencrop International Pvt. Ltd.
NOTICE

In Order to make the indian farming community Internationally Compititive Greencrop Internationational PVt.Ltd. brings the following 100 % Water Soluble Mixture Fertilizers . Per the Order dated 24-10-2015 issued by the Ministry of Agriculture & Farmers Welfare, Govt.of India. New Delhi.

S.No	Name of the Fertilizers	Type of Fertilizer
1	NPK 19:19:19	100% Water Soluble Mixture Fertilizers
2	NPK 13:40:13	100% Water Soluble Mixture Fertilizers
3	Potassium SCHOENITE(K-23%)	STRAIGHT POTASSIUM Fertilizers
4	Chelated Liquid Calcium (Ca- 11%)	STRAIGHT MICRONUTRIENT Fertilizers
5	Chelated Calcium as Ca EDTA (Ca- 9%)	STRAIGHT MICRONUTRIENT Fertilizers
6	Boron Ethanolamine(B-10%)	STRAIGHT MICRONUTRIENT Fertilizers

Salient features : 1 100 % Water Soluble, 2. Improves the Quality and Yield of the produce,3.Suitable to use through Drip irrigation and foliar application(Packing : Available in 1 Kg, 5 Kg, 10 Kg, 25 Kg

Greencrop International Pvt. Ltd.D.No.51-15-A-A4-5,Near Hanuman Weigh Bridge,Bellary Road,Rajiv Nagar, Kallur(Mandal)KURNOOL - 518003. (A.P) India.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
45వ వార్షికోత్సవం
45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం - కర్నూలు
ఆదివారం 31 ఆగస్టు 2025 | పేజీలు : 08

45 ఏళ్ల ప్రజాశక్తి ప్రస్థానం

ప్రజాశక్తి - కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

దోపిడీ రహిత సమసమాజ నిర్మాణానికి 'ప్రతి అక్షరం... ప్రజల పక్షం' అన్న నినాదంతో నడుస్తున్న ప్రజాశక్తి దినపత్రికలోని ప్రతి అక్షరం ప్రజల పక్షంగానే ఉంటోంది. ప్రస్తుతం మన చేతుల్లో ఉన్న ప్రజాశక్తి దినపత్రిక 45 ఏళ్ల క్రితం పురుడు పోసుకున్నది. ప్రజాశక్తి పత్రిక జాతీయోద్యమ కాలం నుంచే వెలువడుతోంది. జాతీయోద్యమ కాలంలోనే 1942లో కమ్యూనిస్టు పార్టీ అధికార పత్రికగా మద్రాసులో మొదటిసారి ఆవిర్భవించింది. 1945 నుంచి విజయవాడ కేంద్రంగా ప్రజాశక్తి మొదలయింది. జాతీయోద్యమ నాయకులకు ప్రజాశక్తి పత్రిక కరదీపికగా మారడంతో బ్రిటీష్ హయాంలో నిషేధానికి గురైంది. ఈ పత్రిక స్వాతంత్ర్యం వచ్చాక 1948లోనూ నిషేధానికి గురైంది. తెలంగాణ విముక్తి కోసం ప్రజాశక్తి నిర్వహించిన పాత్రపై అప్పటి పాలకులు తట్టుకోలేక నిషేధానికి గురి చేశారు. 1969లో వారపత్రికగా తిరిగి ప్రజాశక్తి పునఃప్రారంభమైంది. ఆ తర్వాత 1981 ఆగస్టు 1 నుంచి దినపత్రికగా రూపుదిద్దుకొని దాదాపు 4 దశాబ్దాలకు పైగా శ్రామికవర్గానికి, పీడిత, తాడితులకు, అభివృద్ధి కాముకులకు, అభ్యుదయ వాదులకు కరదీపికగా ప్రజాశక్తి కొనసాగుతోంది. భూ పోరాటమైనా, వ్యవసాయ కార్మికుల కూలి పోరాటాలైనా, అన్నదాతల ఆకలి పోరాటాలకైనా, ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసమైనా ప్రజాశక్తి 'నేనున్నాన'ంటూ వారికి అండగా నిలుస్తోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజలు, కష్టజీవులు పడే ఇబ్బందులను ఇతర పత్రికలు పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసినా వాస్తవాలను ప్రతిబింబించేలా ప్రజాశక్తి ముందు వరుసలో నిలుస్తోంది. ఆయా వర్గాల ప్రజల మన్ననలతో ప్రజాశక్తి దినదినాభివృద్ధి చెందుతోంది. 1981లో మొదలైన ఈ పత్రిక రాష్ట్రవ్యాప్తంగా 10 ఎడిషన్లతో మిగతా పత్రికలకు ధీటుగా పోటీలో నిలబడింది. కర్నూలు జిల్లాలో సమస్యలు, ప్రజా సమస్యలు వెలికితీయడం, ప్రజా పోరాటాలను రూపొందించడంలో ప్రజాశక్తి తనదైన పాత్ర పోషించింది. 1998లో

వార్త 3లో



ప్రజాశక్తి విజయవాడ ఎడిషన్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న పుచ్చలపల్లి సుందరయ్య (ఫైల్)



జిల్లా అభివృద్ధే ప్రధాన ధ్యేయం

- ఓర్వకల్లులో రూ.2 వేల కోట్లతో ఇండస్ట్రియల్ నోడ్
- వేదవతి, ఆర్‌డిఎస్ నిర్మాణానికి ఉత్తర్వులు
- ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రూ.120 కోట్లతో రోడ్లు
- ప్రజాశక్తితో కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కలెక్టరేట్

కర్నూలు జిల్లా అభివృద్ధే ప్రధాన ధ్యేయమని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఓర్వకల్లులో రూ.2వేల కోట్లతో ఇండస్ట్రియల్ నోడ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేదవతి, ఆర్‌డిఎస్ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లాలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రూ.120 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

జిల్లాలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు..?

కలెక్టర్ : జిల్లాలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద రూ.120 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నాం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ రోడ్లు లేని గ్రామాల్లో రూ.12 కోట్లతో రోడ్లు వేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో వర్చువల్ క్లాస్ రూములు ఏర్పాటు చేసి విద్యాబోధన సాగుతోంది. విద్యార్థులకు సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నాం. ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో రూ.8 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టాం. 80 శాతం పూర్తయ్యాయి. బిసి సంక్షేమ హాస్టళ్లలో రూ.1.5 కోట్లతో మరమ్మతు పనులు చేశాం. కర్నూలు జిజిహెచ్‌లో ఐసిఐసిఐ బ్యాంక్ ద్వారా ఎన్‌ఆర్‌ఐ మెషిన్ కోసం రిక్వెస్ట్ చేశాం. పవర్ గ్రిడ్ సహకారంతో జిజిహెచ్‌లో అటెండర్లకు విశ్రమ్ శాల పేరుతో వసతి భవనం నిర్మించనున్నాం. ఒక ఎకరాలో 150 పడకలతో వసతులు కల్పించనున్నారు. గ్రీన్‌కో కూడా రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చింది. ఆస్పిరేషన్ బ్లాక్ కింద మద్దికెర, చిప్పగిరి మండలాలు దేశంలోనే టాప్‌గా నిలిచాయి. రూ.4 కోట్లు నిధులు కేటాయించారు.

జిల్లాను పారిశ్రామికంగా ఎలా అభివృద్ధి చేయనున్నారు?

కలెక్టర్ : ఓర్వకల్లులో రూ.2వేల కోట్లతో ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి చేయనున్నాం. టెండర్లు కూడా ఫైనల్ అయ్యాయి. ఎపిఐఐసి ద్వారా ఆ పనులు చేస్తున్నాం. 10 వేల ఎకరాలు ఎపిఐఐసి ద్వారా అభివృద్ధి చేసి పరిశ్రమలకు కేటాయింపులు చేస్తున్నాం. 6 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఇప్పటికే జైరాజ్ ఇస్పాత్ రెడీగా ఉంది. 300 ఎకరాల్లో డ్రోన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నాం. వీటితో పాటు పత్తికొండలో రూ.11 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నాం. డిసెంబర్‌కు దాన్ని పూర్తి చేయనున్నాం.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

కలెక్టర్ : జిల్లాలో వేదవతి, ఆర్‌డిఎస్ ప్రాజెక్టులను తిరిగి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతర్ రాష్ట్ర ప్రాజెక్టులు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. గుండ్రేవుల కూడా పరిశీలనలో ఉంది.

జిల్లాలోని యూనివర్సిటీల అభివృద్ధికి చర్యలేమైనా తీసుకున్నారా..?

కలెక్టర్ : ప్రస్తుతం ఉన్న భవనాల్లో యూనివర్సిటీలు కొనసాగుతున్నాయి. క్లస్టర్ యూనివర్సిటీ నిర్మాణానికి జగన్నాథగట్టు వద్ద స్థలం ఇచ్చాం. భవనాల నిర్మాణం జరుగుతోంది. ఇంకా రూ.60 కోట్ల దాకా అవసరం ఉంది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ట్రిపుల్ ఐటిడిఎం ఇప్పటికే అయిపోయింది. ప్రహరీగోడ మాత్రం కొంత పెండింగ్ ఉంది.

జిల్లాలో పి-4 కార్యక్రమం ఎలా సాగుతోంది..?

కలెక్టర్ : పి-4 కార్యక్రమం కింద 64 వేల కుటుంబాలను గుర్తించాం. ఇప్పటికే 30 వేల కుటుంబాల నమోదు పూర్తయింది. మిగతా కుటుంబాలను కూడా పూర్తి చేస్తాం. పి-4 కింద ఒక రైతుకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించాం. స్పోర్ట్స్ స్టేడియం అభివృద్ధి చేస్తున్నాం. మరో రూ.10 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాం.

గ్రీవెన్స్‌లో సమస్యలు పరిష్కారం కావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మీరేమంటారు..?

కలెక్టర్ : రెవెన్యూలో రికార్డుల అప్‌గ్రేడేషన్ చేశారు. ఎక్కువగా భూమికి, కొలతలకు తేడాలు ఉంటున్నాయి. అలాంటి ఫిర్యాదులు ఎక్కువగా ఉంటున్నాయి. జాయింట్ ఎల్‌పిఎం సమస్యలు కూడా ఉంటున్నాయి. జాయింట్ ఎల్‌పిఎం డ్రైవ్ పెట్టుకున్నాం. సివిల్ సమస్యలైనా అన్నదమ్ముల భూ సమస్యలు, కుటుంబ సభ్యుల సమస్యలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి. అవి సివిల్ కోర్టులో తేల్చుకోవాల్సి ఉంటుంది. సాధ్యమైనంత వరకూ అన్నిటినీ పరిష్కరించేందుకే చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లా విజన్ 2047 ప్లాన్ ఎలా ఉంది..?

కలెక్టర్ : విజన్ 2047లో భాగంగా 2047 ప్లాన్‌తో పాటు ఐదు సంవత్సరాల ప్రణాళిక కూడా సిద్ధం చేశాం. జిల్లా ఆర్థికాభివృద్ధి రూ.47,514 కోట్ల నుంచి రూ.95,567 కోట్లకు పెరిగేలా ప్రణాళిక రూపొందించాం. తలసరి ఆదాయం రూ.1.74 లక్షల నుంచి రూ.3.51 లక్షలకు పెరగాలి. మొదటి సంవత్సరం లక్ష్యాన్ని అచీవ్ అవుతాం. 15 శాతం అభివృద్ధి సాధిస్తాం.

పరిమళించిన 'పల్లె' మల్లె ప్రభాకర్ రెడ్డి

- స్వశక్తి ఆయన పెట్టుబడి
- రైతు నుంచి ఏ వన్ కాంట్రాక్టర్‌గా విజయ పథం - ప్రజా సేవలో పయనం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కోర మీసం, గంభీర స్వరం, ఒంటిపై తెల్లని లాల్చీ, ధోవతి, భుజాన కండువా, ఆత్మవిశ్వాసం ఉట్టిపడే నడక వెరసి తెలుగుదన రాజసం నడిచొస్తుందా అనే ఆహార్యం ఆయనది. కొత్త కొత్త ఫ్యాషన్లు, దుస్తులు అందుబాటులో ఉన్నా తన ఆహార్యంలో ఏమాత్రం మార్పు ఉండదంటారు ఆయన. వందల మందిలో ఉన్నా ఆయన ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. ఒక సామాన్య మధ్య తరగతి రైతుగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన తన స్వయం శక్తితో అంచలంచెలుగా ఎదుగుతూ పట్టిందల్లా బంగారంగా మారి చివరకు ఏ వన్ కాంట్రాక్టర్ స్థాయికి ఎదిగి అందరి మన్ననలను అందుకున్నారు. ఇంతకు ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరో కాదు. ఆయనే కల్లూరు మండలం పుసులూరు పల్లెల్లో వికసించిన విరజాజి మల్లె పల్లె ప్రభాకర్ రెడ్డి. ఆయన గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం..

ఆయనది సాధారణ మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. పెద్ద నాగిరెడ్డి, నాగరత్నమ్మల కుమారడు ప్రభాకర్ రెడ్డి. ఆయన చిన్నతనంలోనే తండ్రి అస్తమించారు. ఆపై పదవ తరగతి దాకా ఉలిందకొండలో విద్యాభ్యాసాన్ని సాగించారు. కుటుంబ బాధ్యతలు మీద పడటంతో ఆరేళ్లపాటు వ్యవసాయం చేపట్టి కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచారు. బీఏ, బీఈడీ చదివిన అమ్మాయిని వివాహం చేసుకొని 1981లో తన కుటుంబాన్ని కర్నూలు నగర్ పట్టణానికి మకాం మార్చారు. ఉన్న కొంత సొమ్ముతో 1985లో ఒక ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి చిన్న చిన్న పనులు చేయిస్తూ సాధారణ కాంట్రాక్టర్‌గా తన జీవితాన్ని ప్రారంభించారు. అంచలంచలుగా ఎదుగుతూ 1990 నాటికి క్లాస్ వన్ కాంట్రాక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. 1991 నాటికి స్పెషల్ కాంట్రాక్టర్‌గా 2002 వరకు పలు ప్రభుత్వ నిర్మాణ పనులు చేపట్టి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సాధించుకున్నారు. ప్రధానంగా తాను చేపట్టిన నిర్మాణాల్లో పెద్దపాడు నుంచి గార్గేయపురం రోడ్డు మధ్య ఉన్న బ్రిడ్జిలు, లక్ష్మీపురం నుంచి అనుగొండ వరకు రోడ్డు నిర్మాణం, నాగలాపురం నుంచి ఆస్పరి వరకు నిర్మించిన కల్వర్టులు, రాయలసీమకు తలమానికంగా ఉన్న ప్రభుత్వ సర్వజన వైద్యశాల, పీజీ, యూజీ విద్యార్థుల క్వార్టర్స్‌తో పాటు అనేక సబ్ కాంట్రాక్టులను సైతం ఆయన చేపట్టి నిర్మాణాలను దిగ్విజయంగా పూర్తి చేశారు.

రాజకీయ ప్రస్థానం..

రాజకీయంగా ఆయన కుటుంబం మొదటి నుంచి గుర్తింపు కలిగి ఉంది. స్వాతంత్రం అనంతరం ఆయన తాతగారు కల్లూరు మండలం తొలి ప్రెసిడెంట్‌గా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1983లో అదే స్థానం నుంచి తాను పోటీ చేసి ప్రెసిడెంట్‌గా విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన టిడిపి సీనియర్ లీడర్‌గా ఉన్నారు. అందరివాడు అన్న వివాదరహితుడిగా ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

ఆలయ నిర్మాణాలకు చేయూత

పలు గ్రామాల్లో ప్రజల విశ్వాసం మేరకు వివిధ ఆలయాల నిర్మాణాల కోసం ఆయన తనవంతుగా చేయూతనందిస్తూ ఎన్నో గుళ్ళు, ఆలయాలకు ఆర్థిక సహకారాన్ని అందిస్తూ వచ్చారు. ముఖ్యంగా వీరభద్ర స్వామి ఆలయం, శివాలయం, సుంకులమ్మ ఆలయం, మాధవ స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, లచ్చమ్మ ఆలయం, తడకనపల్లె కర్రెమ్మ సుంకులమ్మ ఆలయాలు, ఓర్వకల్లు మండలం ఆంజనేయ స్వామి వారి ఆలయానికి కళ్యాణమండపంతో పాటు ప్రత్యేకంగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఇవే కాకుండా పేద కుటుంబాల పెళ్లిళ్ల కోసం ఆర్థిక సాయం కూడా అందించారు. ముఖ్యంగా ప్రతి ఏటా వినాయక చవితి, శ్రీరామనవమి ఉత్సవ వేడుకల్లో తన ప్రత్యేకతను చాటుకుంటూ వేలాది మందికి కర్నూలు నగరంలో నోరూరించే ప్రత్యేక వంటకాలతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం ఆయన ప్రత్యేకత. అందులో భాగంగా వెంకటరమణ కాలనీలో చేపట్టే వినాయక చవితి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమంలో అందరిదీ ఒక ఎత్తు అయితే ఆయనది మరో ఎత్తుగా కార్యక్రమం నిలుస్తుంది. ఆయన చేస్తున్న సేవలను పలువురు హర్షిస్తున్నారు. భవిష్యత్తులో ఆయన మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నారు.

ప్రజాశక్తికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

కర్నూలు జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, మిత్రులకు ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు...

శ్రీ లక్ష్మీ నారాయణ యాదవ్
స్టియటైట్ మినరల్ డీలర్
చంద్రపల్లె గ్రామం,
ప్యాపిలి మండలం.

శ్రీ రాము
ఐరన్ ఓర్ ట్రేడర్,
కర్నూలు.

ఇంపీరియల్ కలర్
గ్రానైట్ క్వారీలు,
ఆదోని.

ఎస్.ఆర్.సి స్టోన్ క్రషర్,
ప్రొప్రైటర్ : రమేష్ బాబు
ఆదోని.

భాగ్యలక్ష్మి గ్రానైట్
ప్రొప్రైటర్ : అవినాష్
పెసలబండ గ్రామం, ఆదోని.

ఐ. చంద్రశేఖర్
స్టియటైట్ క్వారి యజమాని
బొడ్డువానిపల్లి, ఓర్వకల్లు మండలం.

45 ఏళ్ల ప్రజాశక్తి ప్రస్థానం

ప్రజాశక్తి కలర్ ప్రింటింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న అప్పటి కలెక్టర్ ముఖేష్‌కుమార్‌మీనా

మొదటి పేజీ తరువాయి...

మొదటిసారి కర్నూలులో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేశారు. విజయవాడ ప్రచురణ కేంద్రంగా ఉండే ఈ ప్రాంతీయ కార్యాలయానికి కర్నూలు జిల్లాతోపాటు అనంతపురం, కడప జిల్లాల వార్తలు వచ్చేవి. 2003లో కర్నూలులోనే ఎడిషన్ ప్రారంభమై స్థానిక వార్తలకు, స్థానిక ఉద్యమాలకు ప్రాధాన్యమిచ్చేలా 8 పేజీలతో జిల్లా ప్రత్యేక సంచికను తీసుకొచ్చింది. కర్నూలు, మహబూబ్‌నగర్, అనంతపురం జిల్లాలకు కర్నూలులో ఉండే ప్రచురణ కేంద్రం ద్వారానే ప్రజాశక్తి దినపత్రికలు వెళ్లేవి. 2014లో రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణలో ప్రజాశక్తి స్థానంలో 'నవతెలంగాణ' ఏర్పడడంతో కర్నూలులో ఉన్న ప్రజాశక్తి ప్రచురణ కేంద్రం అనంతపురం, కర్నూలు జిల్లాలకు పత్రికలను పంపేది. అన్ని వర్గాల ప్రజల అండతో విస్తరణలో తనదైన ముద్ర వేసుకున్న ప్రజాశక్తి 2017లో అనంతపురంలో కూడా ప్రచురణ కేంద్రం ఏర్పాటు కావడంతో ప్రస్తుతం కర్నూలులో ఉన్న ప్రచురణ కేంద్రం కర్నూలు జిల్లాకు ప్రచురణ కేంద్రంగా మారింది.

కర్నూలు ఎడిషన్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న కీర్తిశేషులు నగరూరు సుబ్రమణ్యం

ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, యువజనులు, మహిళలు ఇలా అన్ని వర్గాలకూ ప్రత్యామ్నాయ మీడియాగా ప్రజాశక్తి నిలుస్తోంది. గతంలో కేవలం పట్టణ ప్రాంతాలు, జిల్లా ప్రాంతాలకే పరిమితమైన పత్రిక మారుమూల గ్రామాలకు కూడా వెళుతోంది. ఉమ్మడి జిల్లాలోని 54 మండలాలకు ప్రజాశక్తి వెళుతోంది. వ్యాపార ధోరణికి భిన్నంగా ప్రజల్లో ప్రజాస్వామిక చైతన్యాన్ని రగిల్చే పాత్ర పోషిస్తోంది. వార్తలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ప్రజాశక్తి ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో కరువు ఏర్పడినప్పుడు అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చింది. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించింది. 2009లో వచ్చిన వరదల సందర్భంగా కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వైద్య శిబిరాలు నిర్వహించింది. సర్వం కోల్పోయిన వారికి స్టౌవ్‌లు, వంట పాత్రలు, దుస్తులు పంపిణీ చేసింది. శ్రమదానం చేసి కర్నూలు ఓల్డ్‌టౌన్‌లో బురదమట్టిని, చెత్తాచెదారాన్ని తొలిగించింది. వివిధ సందర్భాల్లో ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక సంచికలు ప్రచురించింది. అవగాహన సదస్సులు నిర్వహించింది. కరోనా మహమ్మారి విస్తరించిన సందర్భంగా ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది.

అన్నార్థులు, దినసరి కూలీలు తిండి దొరకక ఇబ్బందులు పడ్డారు. వారి కాలేకడుపులు నింపేందుకు ప్రజాశక్తి సిబ్బంది 15 రోజులు వంటలు చేసి కర్నూలు నగరంలో ప్రధాన కూడళ్లలో ఆహారం అందించారు. రేషన్ కార్డులు లేని కొన్ని కాలనీలను గుర్తించి బియ్యం, పప్పు, మంచినూనె తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది వార్షికోత్సవానికి జిల్లా సమగ్రాభివృద్ధిపై సదస్సు నిర్వహిస్తున్నారు. ఆర్థిక, రాజకీయ, విద్యా, వైద్య, సామాజిక రంగాల నిపుణులు, మేధావుల సూచనలు తీసుకుంటున్నారు. వాటి అమలుకు పాలకులను

కరోనా నేపథ్యంలో ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

మేల్కొలిపేలా కథనాలతో ప్రత్యేక సంచికలో, దినపత్రికలో కూడా ప్రచురిస్తున్నారు. దీనికి విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ నాయకులు, జిల్లా అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, అన్ని రంగాల ప్రజలు సహకరిస్తున్నారు.

ఏడాది పాలనంతా మోసం, వేధింపులే

- జిల్లాలో పార్టీ బలోపేతానికి చర్యలు - హామీలన్నీ నెరవేర్చే వరకూ కూటమిపై పోరాటం

- ప్రజాశక్తితో వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కూటమి పాలనంతా మోసం, వేధింపులేనని వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో వైసిపి బలోపేతానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకూ కూటమి ప్రభుత్వంపై పోరాటం సాగిస్తామన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ఎలా ఉంది..?

మోహన్ రెడ్డి : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా మోసం, వేధింపులే. ఒకటిన్నర సంవత్సరమైనా జిల్లాలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు పనులూ ప్రారంభించలేదు. గుంతలు పూడ్చారు తప్ప కొత్త రోడ్లేమీ వేయలేదు. గుండ్రేవులకు తెలంగాణ సమస్య ఉందని చెబుతున్నారు. అక్కడ ఆయన శిష్యుడే సిఎంగా ఉన్నారు. ఆయనను ఒప్పించడం ఎంత పని. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన లేదు. రాయలసీమ మీద అసలు లేదు. షో పుటప్ తప్ప ఎక్కడా ఏమీ చేయలేదు. రూ.4వేల పింఛన్ ఇవ్వడానికి ప్రతి నెలా రూ.4 కోట్లు ఖర్చు చేస్తున్నారు. తొలి సారి ఇవ్వడం ఒకే. ప్రతి నెలా ఇవ్వడం యాక్షన్ చేయడం డ్రామా కాదా? జగన్ ఎలాంటి షో లేకుండా బటన్ ద్వారా నేరుగా అకౌంట్లలో వేశారు. పింఛన్లు పెంచామని చెబుతూనే చాలా మంది వికలాంగుల పింఛన్లు తొలగించారు. ఇంకా చాలా మందికి నోటీసులు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని మోసం చేశారు. 18 రకాల బస్సులు ఉంటే 5 రకాల బస్సుల్లోనే ఉచిత ప్రయాణం కల్పించారు. బస్సులు తక్కువై మహిళలు కొట్లాడుకుంటున్నారు. మహిళల గౌరవాన్ని బజారుపాలు చేశారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఇవ్వలేదు. రైతులకు రూ.20 వేలు ఇవ్వకుండా మోసం చేశారు. కర్నూలు హైకోర్టును కాదని బెంచి అన్నారు. దాని కోసం ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. వైసిపి నాయకులందరినీ ఏదో ఒక కేసు పెట్టి జైలుకు పంపిస్తున్నారు. ఒకే విషయంపైన చాలా చోట్ల కేసులు పెడుతున్నారు. ఒకే విషయంపైన కేసులన్నీ కలపాలని సుప్రీం కోర్టు ఆదేశాలున్నా పాటించడం లేదు. పోసాని, కాకాని, కృష్ణ మోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి ఇలా చాలా మందిని జైలుకు పంపారు. ఇది చినబాబు గారి రాక్షసానందం.

జిల్లాలో పార్టీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టారు..?

మోహన్ రెడ్డి : పార్టీ అభివృద్ధి కోసం కమిటీలు వేశాం. మండల, నియోజకవర్గ కమిటీలు, జిల్లా కమిటీ పూర్తయ్యాయి. 29 అనుబంధ రంగాల కమిటీలను కూడా పూర్తి చేశాం. ప్రభుత్వ అన్యాయాలపై పోరాటం చేస్తున్నాం. రైతుల తరపున ధర్నా చేశాం. తల్లికి వందనం కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చాం. అయినా సగం మందికే ఇచ్చారు. ఫీజు రిఎంబర్స్‌మెంట్ మీదా ధర్నా చేశాం. కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే కర్నూలు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఐదుకు ఐదు స్థానాలు గెలిచాం. గత జులైలోనూ ఐదు స్థానాలనూ ఏకగ్రీవంగా గెలుచుకున్నాం. ఆదోనిలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పార్టీ మారితే అవిశ్వాసం పెట్టి మళ్లీ మా పార్టీ వ్యక్తినే ఛైర్‌పర్సన్‌ను చేసుకున్నాం. జిల్లాలో పార్టీ నాయకత్వం బలంగా ఉంది. జగన్ సొంత జిల్లాలోలాగా జిల్లాలో రెండు స్థానాల్లో వైసిపి ఎమ్మెల్యేలు గెలిచారు.

పార్టీలో యువతకు, మహిళలకు ఎలాంటి ప్రాధాన్యత ఇస్తున్నారు..?

మోహన్ రెడ్డి : యువతకు, మహిళలకు పార్టీలో చాలా ప్రాధాన్యత ఉంది. ప్రతి కమిటీలో వారికి స్థానం కల్పిస్తున్నాం. మా భార్యనే మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇచ్చాం. ఎమ్మెల్యే ఎన్నికల్లో జిల్లాలో ఇద్దరు మహిళకు అవకాశం ఇచ్చాం.

భవిష్యత్‌లో ఎలాంటి కార్యక్రమాలు చేయనున్నారు..?

మోహన్ రెడ్డి : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకూ పోరాటం చేస్తూనే ఉంటాం. వైసిపి నాయకుల మీద అక్రమ కేసుల పెట్టిన కేసులను ఎదుర్కొంటాం. గుండ్రేవుల, వేదవతి వంటి ప్రాజెక్టుల కోసం పోరాడతాం.

పార్టీ కార్యకర్తలకు ఎలాంటి భరోసా ఇస్తారు..?

మోహన్ రెడ్డి: టిడిపి ఎంత వేధిస్తే అంత రియాక్షన్ వస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన మూడు, నాలుగు నెలలు కార్యకర్తల్లో నిరుత్సాహం ఉండేది. తరువాత ఉత్సాహం వచ్చింది. ఎంత మంది నాయకులను జైల్లో పెడితే అంత ఉత్సాహం వస్తోంది. పోరాటంతోనే వైసిపి పుట్టింది. మా నాయకుడు 16 నెలలు జైల్లో ఉండి వచ్చారు. ఎనిమిదేళ్ల పోరాటం చేసి అధికారంలోకి వచ్చిన పార్టీ వైసిపి. వైసిపి కార్యకర్తలు ఎవరూ భయపడరు. దేనినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు.

ప్రజాశక్తి మనుగడకు తోడ్పడతాం

- పి.లింగేశ్వర రెడ్డి, కోర్ డీన్, నారాయణ కళాశాలలు, కర్నూలు.

ఇప్పటి రాజకీయ పరిస్థితులలో, పత్రికలు, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలు చాలా వరకు పార్టీలకు, వర్గాలకు, కుల, మత పరంగా సంకుచిత దృక్కోణాలను అనుసరిస్తున్నాయి. అయితే ప్రజాశక్తి దినపత్రిక మాత్రం ప్రజల కోసమే నిరంతరం పోరాడుతుండడం అభినందనీయం. ఇలాంటి ప్రజాపక్షపాత పత్రికలు నేటి ప్రజాస్వామ్యానికి, ప్రజల హక్కుల పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇలాంటి పత్రికలను ప్రోత్సహించడం ప్రతి బాధ్యతాయుతమైన పౌరుడి కర్తవ్యంగా భావించాలి. ఈ పత్రికలు ఆర్థికంగా లేదా ఇతరంగానూ ఇబ్బందులు ఎదుర్కొనకుండా బలంగా నిలబడాలని ఆకాంక్షిస్తున్నాం. అందుకు మా పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది.

ప్రలోభాలకు లొంగని పత్రిక

- డాక్టర్ సంజీవ్ కుమార్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్.

నిజాలను నిర్భయంగా రాస్తూ.. వాస్తవాలకు దర్పణం పడుతూ ప్రలోభాలకు అమ్ముడు పోని ఏకైక పత్రిక ప్రజాశక్తి దినపత్రిక. ఓర్పు, నేర్పు, పరిణిత సాధించడం వల్లే ప్రజాశక్తి యాజమాన్యం పోటీని తట్టుకుని నెట్టుకు రాగలుగుతుంది. అలాగే విద్యార్థినులు చదువులను ఓర్పుతో నేర్పుగా నేర్చుకుని క్రమశిక్షణతో పైకి రావాలి. రాజకీయాల్లో సైతం రాణించాలి. రాజకీయాలతో పాటు యువత, మహిళలకు అవసరమైన సందేశాత్మక కథనాలు ప్రజాశక్తిలో రావాలని కోరుకుంటున్నాం.

నాచదువులో నాన్నపాత్ర కీలకం

- డాక్టర్ సుస్మిత, ఎంబిబిఎస్, ఎండి. జంధ్యాల రఘుబాబు కూతురు

నేను ఏకైక కూతురు నైనా నన్ను ఎప్పుడు ఆయన అమ్మాయి అన్న భావనతో పెంచలేదు. నన్ను ప్రోత్సహించి ఎంబిబిఎస్, ఎండి చదివేలా సహకరించడంలో నాన్న పాత్ర కుడా చాలా ముఖ్యమైనది.

ఉద్యోగం చేయడానికి పూర్తి సహకారం ఆయనదే

టిఎం.శైల కుమారి, జంధ్యాల రఘుబాబు సతీమణి

ఉద్యోగ ప్రస్థానంలో అసోసియేషన్స్ తోను, సాహితీ స్రవంతి, జన విజ్ఞాన వేదిక లో పనిచేస్తున్న కుటుంబ కార్యక్రమాల్లో కూడా పాల్గొంటూ వచ్చారు. నేను ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం చేయడానికి ఆయన సహాయ సహకారాలు అందించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

బి.నాగార్జున రెడ్డి,
సీనియర్ బ్రాంచ్‌మేనేజర్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కర్నూలు

జంధ్యాల రఘుబాబు 36 సంవత్సరాల మంచి సర్వీసును చేశారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇన్సూరెన్స్ సంబంధిత యూనియన్‌లో యాక్టివ్‌గా పని చేశారు. అన్ని రంగాల ఇన్సూరెన్స్ ఉద్యోగుల పక్షాన పోరాడారు. అపాయింట్‌మెంట్స్ పొందిన ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు. ఉద్యోగుల బెన్‌ఫిట్స్ మీద మంచి కమిట్‌మెంట్ ఉంది. వారి పోరాటాల వల్ల ఎంతోమంది లబ్ధిపొందారు. ఆయన ఉద్యోగిగానే కాకుండా బాహ్య ప్రపంచంలో రచయితగా మంచి మనిషిగా అనేక సేవలు చేశారు. జిల్లాలో జాయింట్ ఫోరంఆఫ్ ట్రేడ్ యూనియన్స్ కీలకంగా వ్యవహరించారు.

ఐక్య ఉద్యమాల సహకారి

నాగరాజు, మాజీ జిల్లా అధ్యక్షుడు
ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్

జంద్యాల రఘుబాబు ఈనెల 31న యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ నుండి ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా వారు గురించి కొన్ని విషయాలను తెలియజేస్తున్నాను. రఘుబాబు కార్మిక నాయకుడిగా సంస్థలోని ఉద్యోగుల సమస్యల గురించి ఎన్నో ఉద్యమాలు , వారి సంస్థ పరిరక్షణకు అంటే ఇన్సూరెన్సు రంగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ కొరకు ప్రయత్నం చేసిన ప్రతిసారి ఉద్యమం చేసి అడ్డుకోవడం చేశారు. ఇందుకొరకు కర్నూలులో ఏర్పాటైన సేవ్‌పబ్లిక్ సెక్టార్ కమిటీలో ప్రధాన పాత్ర వహిస్తూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడు కోవటానికి ఇతర యూనియన్ నాయకులతో కలిసి పోరాటాలు చేశారు. ఇదికాకుండా ఆయన మంచి ప్రజాకవిగా సామాజిక సమస్యల మీద, ప్రాంతీయ సమస్యల మీద తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేస్తున్నారు.

సామాజిక స్పృహ ఉన్న రచయిత

వై.జయ రాజు, సీనియర్ న్యాయవాది

జంధ్యాల రఘుబాబు సామాజిక చైతన్యాన్ని నింపే రచనలు చేస్తారు. ఐక్య ఉద్యమాలకు ముందుంటారు. ఆయన ఉద్యోగ విరమణ తరువాత కూడా మంచి రచనలు చేయాలి. ప్రజలను మరింత మేల్కొలపాలి. కర్నూలుకు హైకోర్టు కావాలని న్యాయ వాదులు చేసిన పోరాటానికి సంఘీభావం తెలిపారు. రఘుబాబుకు హృదయ పూర్వక ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

విలక్షణమైన సాహితీ దక్పథం కలిగిన వారు-

బిఎల్ఎన్ ప్రసాద్ శర్మ .మెడికల్ రెప్ యూనియన్ నాయకులు

జంధ్యాల రఘుబాబు ఒక విలక్షణమైనా సాహితీ దృక్పథం కలిగిన వ్యక్తి. అనేకమంది సాహిత్యాన్ని కవితలను కేవలం వినిపించడానికో ,ప్రచురణ కోసం మాత్రమే పరిమితమై వుంటారు. కానీ రఘు బాబు తన సాహిత్య దక్పథాన్ని సామాజిక దృక్పథంలో చూస్తూ సామాజిక అంశాల్లో బాధ్యత వహిస్తూ భాగస్తులు అయ్యారని మనం గుర్తించాల్సిన అంశం. కవితలకు ఆచరణకు అనుకూలంగా ఉండే వ్యక్తి. అంతేకాక తన సాహిత్యంతో ప్రజలను చైతన్య పరుస్తారు. తాను పనిచేసే వత్తిలో కూడా సామాజిక శ్రామిక భావాలను ముందుకు తీసుకెళ్లి జయంప్రదమయ్యారు.

మనసున్న ఒక మంచి మనిషి

ఇ. హన్మంత్ రెడ్డి, అధ్యక్షులు , ఎపిజిబి ఎంప్లాయిస్ అసోసియేషన్

కర్నూలు జిల్లాలో అన్ని కార్మిక సంఘాలు మా మనిషి అని అనుకునే ఒక మహనీయుడు. ఎక్కడ, ఎవరికి... ఏ అవసరం ఉన్నా...నేనున్నాను అని చెప్పే, ఒక గొప్ప మనీషి. అన్ని కార్మిక సంఘాలు సంఘటితం కావాలని అభిలషించే ఒక విశాల హృదయం ఉన్న ఒక కార్మిక నాయకుడు.కర్నూలులో ఎవరు గొంతెత్తినా, తన గళంతో పాటు కలాన్ని సైతం కలిపి.... తన అడుగులను వారితో కలిసి కదిపిన ధన్యజీవి . ప్రతి గ్రామీణ బ్యాంకుఉద్యోగితో, రఘుబాబుకుమూడు దశాబ్దాల సుదీర్ఘం ఆత్మీయతానుబంధం ఉంది. పోరాటం నిత్యకృత్యమైన గ్రామీణ బ్యాంకుల ఉద్యమాల్లో, ప్రతి అడుగు రఘుబాబుతో కలిసి పయనించినందుకు గర్విస్తున్నాము. కర్నూలులో జరిగిన ప్రతి సంఘటిత రంగ ఉద్యమానికి, తన ఊపిరిలూదిన రఘు బాబుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. వారి విశ్రాంత జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా గడపాలని కోరుతున్నాం. రిటైర్మెంట్ ఉద్యోగానికే కానీ, రఘుబాబు గొంతుకూ, కళానికి కాదని.... ఇక నుంచి ఆయన శ్రమజీవుల గొంతుకై, ఒక దిక్సూచిగా ఉంటారనే ప్రగాఢ విశ్వాసంతో....

ఆశయాలకు, అభిరుచులకు విరమణ లేదు



- తెలకపల్లి రవి, రాజకీయ విశ్లేషకులు

జంధ్యాల రఘుబాబు ఉద్యోగ విరమణ సందర్భంలో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఉద్యోగ విరమణ అన్నది ఉద్యోగ సంబంధమైన విషయమే తప్ప వ్యక్తుల సంస్థల ఆశయాలు అభిరుచులు ఆసక్తులకు విరమణ అంటూ వుండదు. అందులోనూ తన యునైటెడ్ ఇన్సూరెన్స్ సంస్థ కర్నూలు విభాగాన్ని నిలబెట్టడం కోసమే పోరాడి విజయం సాధించిన రఘుబాబు వంటివారికి ఇది మరింతగా వర్తిస్తుంది. నాన్న నరసింహయ్య లక్ష్మమ్మల మేనల్లుడుగానే గాక వారి ఉద్యమ వారసత్వం తీసుకున్న కార్యకర్తగా రఘుబాబు కర్నూలు మిత్రుల ప్రేమాభిమానాలు చూరగొన్నారు. బాధ్యతల పరంగా మా సోదరులం , నేను అన్న చంద్రం, తమ్ముడు హరి వేర్వేరు చోట్ల వుండాల్సి వచ్చినా తను మాత్రం వాళ్లను కుటుంబ పెద్దలుగా, ఉద్యమ నిర్మాతలుగా కూడా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. తను ఇక్కడ వుండటం మాకు వారి గురించి ఎంతో భరోసాగా వుండేది. తన కార్యాలయంలోనూ సమాజంలోనూ ఉద్యమంలోనూ అప్పగించిన బాధ్యతలు శ్రద్ధగా నెరవేర్చడంతో అవసరమైన ప్రతివారికి శాయశక్తులా సహాయపడుతూ రఘుబాబు స్నేహశీలిగా మన్నన పొందారు..

వామపక్ష భావజాలం, ఎఐఐఇఎ నాయకత్వం మాత్రమేగాక జన విజ్ఞాన వేదికలోనూ, మధ్య తరగతి బుద్ధిజీవుల సంఘాలలోనూ రఘుబాబు పనిచేస్తున్న తీరు అందరికీ తెలుసు. ఇప్పుడు ఉద్యోగ విరమణ తర్వాత మరింతగా సేవలందిస్తారని అందరూ ఆశిస్తున్నారంటే కారణమదే. వీటితో పాటు రచన అనువాదం, ఉపన్యాసాలు తనను ప్రజలకు మరింత దగ్గర చేశాయి. రోజువారి ఒత్తిళ్లు, ఉద్యోగ బాధ్యతలు, సంఘాలలో పనితో పాటు నిరంతర రచనా వ్యాసంగం తనకు ప్రత్యేకత తెచ్చిపెట్టింది. నా స్మృతిలో చేగువేరా అన్న కాస్ట్రో వ్యాసాలను మేము అనువాదం చేసినపుడు అదొక ఉత్తేజకరమైన గ్రంథంగా తెలుగు పాఠకులనే గాక ప్రముఖ రచయితలను కూడా ఉత్సాహపర్చడం నాకు తెలుసు. ప్రజాశక్తితో సహా వివిధ పత్రికలలో కాలమ్స్ రాస్తూ వ్యంగ్యం హాస్యం పుష్కలంగా అందిస్తూవచ్చారు. రెండు దశాబ్దాలుగా సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శిగా తెలుగు రాష్ట్రాలలో సాహితీ మిత్రులకూ సన్నిహితుడైనారు.

తను పుట్టి అక్షరాసాభ్యాసం చేసిన రోజునుంచి నేను చూస్తున్న రఘుబాబు అక్షరాలలోనూ ఆచరణలోనూ అభ్యుదయ భావజాలానికి కార్యాచరణకూ అంకితమై కృషి చేయడం మాకందిరకీ ప్రత్యేకంగా సంతోషకారణమైంది. సేవాభావంతో చైతన్యశీలతతో స్నేహశీతతో వివాదరహితమైన స్నేహశీలిగా పేరుపొందిన రఘుబాబు రానున్న రోజులలో ఈ కృషిని మరింత సమర్థంగా కొనసాగిస్తారని ఆశిస్తున్నాను. తనకూ కుటుంబ సభ్యులకూ, సన్నిహితులైన బంధుమిత్రులకు, ఉద్యమ సహచరులకూ అభినందనలు అందిస్తున్నాను.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

వై.సుబ్బారావు, జనరల్ సెక్రెటరీ,
హైదరాబాద్ రీజియన్ జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్

జంధ్యాల రఘుబాబు 1989 జులై 13న యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో జాయిన్ అయ్యారు. కంపెనీలో జాయిన్ అయినప్పటి నుంచి ఎఐఐఇ చేస్తున్న ఆక్టివిటీస్ పట్ల ఆకర్షితులై యూనియన్ కోసం పనిచేశారు. యూనిట్ కార్యదర్శిగా, జిల్లా నాయకులుగా 2008 సంవత్సరంలో హెచ్‌ఆర్‌జిఐఇ 19వ మహాసభలు ఖమ్మంలో సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటినుండి అదే పదవిలో కొనసాగుతున్నారు.ఎఐఐఇఎ చేపట్టిన అనేక పోరాటాలలో పాల్గొన్నారు. ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన సమ్మెలు, వేతన సవరణ కోసం జరిగిన పోరాటాలలో ఉత్సాహంగా పాల్గొనేవారు. ఎఐఐఇఎను రాయలసీమ జిల్లాలలో బలోపేతానికి కృషి చేశారు. హెచ్ఇజిఐఇఎ 15వ మహాసభలు 2001లో కర్నూలు పట్టణంలో జయప్రదంగా నిర్వహించడంలో రఘు బాబు కీలక పాత్ర పోషించారు. కర్నూలు జిల్లా జెఎఫ్‌టియుకు రఘు బాబు నాయకత్వం వహించి నాలుగు కంపెనీల ఉద్యోగులను సమీకరించి అనేక పోరాటాలు నిర్వహించారు. రఘుబాబు ఇన్సూరెన్స్ రంగానికే కాక సిఐటియు , ఆర్‌టిసి, జన విజ్ఞాన వేదిక, సాహిత్య వేదిక వంటి రంగాలలో కూడా పనిచేశారు. రఘుబాబు వామపక్ష కుటుంబం నుంచి వచ్చినవారు. ఈ భావజాలంతో పాటు వారు ఒక మంచి కవి, రచయితగా అనేక కవితలు , రచనలు చేశారు. వాటికి వారికి మంచి పురస్కారాలు కూడా లభించాయి. ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందనలు తెలియజేస్తూ, వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలని కోరుతున్నాం.

అలుపెరుగని సాహితీ సాహసయాత్రికులు

-కెంగార మోహన్, ఃసాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు

జంధ్యాల రఘుబాబు తెలుగుసాహిత్యంలో పదునెక్కిన సాహిత్య సృజనకారులు. కవిగా, కథకులుగా, విమర్శకులుగా, కాలమిస్ట్‌గా, అనువాదకులుగా తెలుగుసాహిత్యంలో విశేషకృషిచేస్తూ సాహిత్యానికి వైవిధ్యమైన కవిత్వాన్ని, మానవీయకోణాన్ని సృశించే కథల్ని, గుండెలదిరేలా ప్రకంపనాలను కలిగించే ప్రజాచైతన్యానికి పునాదులు వేసే పాటల్ని అందిస్తున్న సాహితీవేత్త. ఆహ్లాదపరిచే హాస్యచతురత వ్యాసాలు రాసినా, అంతర్జాతీయస్థాయి ఉద్యమకారుల జీవితాల్ని తెలుగు సాహిత్యానికి అనువాదాలుగా పరిచయం చేసినా, తనకలంతో ఏ సాహిత్య ప్రక్రియ పురుడుబోసినా నిప్పుకణికల్లాంటి వాక్యాల్ని అందించడంలో ఎప్పుడూ విఫలమవ్వలేదు. ఈ పుస్తకంలో సాహిత్య ప్రక్రియలైన కవిత్వం, కథ, నవల, విమర్శకు సంబంధించి లోతైన, పదునెక్కిన విమర్శచేయడంలో సఫలమయ్యారు. అనేక నిర్మాణసూత్రాలేకాక, సైద్ధాంతిక చర్చనూ తన రచనల్లో చేసిన సమర్థులు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా అతడికి సాహిత్య జీవితముంది. కవిగా ప్రారంభమైనప్పటికీ ఏ సాహిత్యప్రక్రియను విస్మరించలేదు. వొక్క నాటకం మినహా తెలుగు సాహిత్య ప్రక్రియలన్నీ రాస్తున్నారు. అవి విశేషంగా ప్రచురించబడ్డాయి. 26 మంది తనెంపిక చేసుకున్న కవుల పుస్తకాలను సమీక్షించిన గ్రంథమది. అందులోనూ విమర్శలోని మౌలిక సూత్రాలన్నింటినీ తడిమారు. ఇది అరుదైన విషయం. సాహితీస్రవంతి సామాన్య కార్యకర్త నుండి అంచెలంచెలుగా ఎదిగి అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించి సాహిత్యకారులకు ప్రగతిశీల సాహిత్యాన్ని చేరువ చేసిన లిటరరీ యాక్టివిస్ట్. వైవిధ్యమైన కార్యక్రమాల రూపకర్త. అరుదైన వ్యక్తిత్వం, అమితమైన ప్రేమకలిగిన సున్నిత స్వభావి. నాకు పరిచయమున్నంతవరకు సాహితీక్షేత్రంలో నిరంతరం పచ్చటిపంటను పండిస్తున్న సాహిత్య వ్యవసాయదారుడు.

సామాజిక స్పృహ కలిగిన నాయకుడు

ఎండి. అంజి బాబు , సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

రఘు బాబు వర్గ దృక్పథం, సామాజిక స్పృహ కలిగిన గొప్ప నాయకుడు. రఘు బాబు వర్గ దృక్పథం సామాజిక స్పృహ మేలవించిన గొప్ప పోరాట యోధుడు. సంఘటిత రంగ రక్షణకు అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. సహచర ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం కృషి చేశాడు. తాను పనిచేస్తున్న ఇన్సూరెన్స్ రంగం రక్షణ కోసమే కాకుండా బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కదలి పనిచేశాడు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప లోనే ఉండాలని చేసిన పోరాటం రఘుబాబు ప్రోత్సాహంతోనే సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన పోరాటం జిల్లా వ్యాప్త ఉద్యమంగా రూపుదిద్దుకుంది. సిఐటియు నిర్వహించే అనేక పోరాటాలలో భుజం భుజం కలిపి పోరాడటమే కాకుండా సామాజిక ఉద్యమాలకు తోడుగా నిలబడ్డాడు. మరోవైపు సమకాలీన సమస్యలపై సాహిత్య రంగంలో కృషి చేశాడు. ఈ కృషి ఇంకా కొనసాగాలని, పోరాటాలకు అండగా నిలబడాలని కోరుకుంటూ ఉద్యోగ విరమణ సందర్భంగా శుభాకాంక్షలు.

మార్గదర్శి

డాక్టర్ కె.బడే సాహెబ్,చరిత్ర అధ్యాపకులు

జంధ్యాల రాఘుబాబు 31 ఆగస్టు 2025 పదవీ విరమణ సందర్భంగా వారికి శుభాకాంక్షలు. మూడు దశాబ్దాలకుపైగా జనవిజ్ఞాన వేదికలో మాతో పాటు సమాజంలో, విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన కొరకు అనితర కృషి చేశారు. కవి, రచయితగా వినోదభరితమైన రచనలతో సామాజిక దోషాలను బహిర్గతం చేశారు. వందలాది వ్యాసాలతో మనషులను మేల్కొలిపి, మార్పుకు పిలుపునిచ్చారు. అతని జీవితం నిజాయితీ, సత్యానికి ప్రతిరూపం. ఖ్యాతి కోసం కాదు, ప్రజల కోసం దీపమై వెలిగారు. యువతకు మార్గదర్శకుడిగానే కాక, ఆదర్శంగా నిలిచారు. ఉద్యోగ విరమణ ఆయనకు ఒక విరామం మాత్రమే, ముగింపు కాదు. రఘుబాబు కన్న కలలు సాకారం కావాలని కోరుకుంటున్నాను.

ఉద్యమాలకు ఊతం రఘుబాబు ఉద్యోగ జీవితం

సాహిత్య రంగంలో చురుకైన పాత్ర -యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ సంస్థనుంచి నేడు ఉద్యోగ విరమణ

ఎవరు గొంతెత్తినా, తన గళంతో పాటు కలాన్ని సైతం కలిపే సాహిత్య కారుడు. సంఘటిత రంగ ఐక్య ఉద్యమానికి తోడ్పాటు అందించిన నాయకుడు. చురక సంహిత ద్వారా పాలకులను తన కలంతో ప్రశ్నించిన రచయిత. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగం నుంచి విరమణ పొందుతున్న జంధ్యాల రఘు బాబుపై ప్రత్యేక కథనం.

కర్నూలు నగరంలోని కీర్తిశేషులు చిదంబరశర్మ, వేంకట లక్ష్మమ్మ దంపతులకు 1965 ఆగస్టు 17న జంధ్యాల రఘుబాబు జన్మించారు. పెద్ద కుటుంబం.. ఐదుగురు అక్కచెల్లెళ్ళ మధ్య తనొక్కడే అబ్బాయి. అమ్మ చిన్నప్పుడే చనిపోవడంవల్ల మేనమామ టి.నరసింహయ్య, మేనత్త టిసి.లక్ష్మమ్మ పెంపకంలో కొన్ని సంవత్సరాలు, తరువాత విడిగానూ పెరిగారు. వారినుండి మా కుటుంబానికి నిరంతరం సహకారం ఉంటూనే ఉందని అంటారాయన. ఎలిమెంటరీ విద్య నుండి ఆరవతరగతి వరకు కర్నూలు బి.క్యాంపులోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో సాగింది. ఏడవ తరగతి నుండి పదవతరగతి వరకు బి.క్యాంపులోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో, ఇంటరు, డిగ్రీ కర్నూలు ఉస్మానియా కళాశాలలో, ఎంకాం అనంతపురంలోని శ్రీ క్రిష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో చేశారు. గ్రూప్ వన్, టూ పరీక్షలకు చదివి మంచి ఉద్యోగం తెచ్చుకోవాలనే ఉండింది. కాని చదువైపోయిన వెంటనే ఏదో ఒక ఉద్యోగంలో చేరవలసి వచ్చింది. అప్పటికే వారి నాన్న ఫార్మసిస్టుగా ఉద్యోగ విరమణ చేయడం ఆయనకొచ్చే పెన్షన్ కుటుంబానికి సరిపోకపోవడంతో 1988 కేంద్రీయ విద్యాలయ, కర్నూలులో తాత్కాలిక ఎల్‌డిసిగా, తరువాత పర్మనెంట్ యుడిసిగా పని చేశారు. 1989 జులైలో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, కర్నూలులో టైపిస్టుగా చేరారు. ఆదోనిలో రెండు సంవత్సరాలు పని చేశారు. 2004 లో సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొంది నంద్యాల వెళ్లారు. అక్కడ నాలుగు సంవత్సరాలు పనిచేసి తిరిగి కర్నూలుకు బదిలీ అయ్యారు. 36 సంవత్సరాల, రెండు నెలలు సర్వీసు అనంతరం 2025 ఆగస్టు 31 ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఉద్యోగ సంఘంలో చురుగ్గా పనిచేయడం వల్ల, వారి శ్రీమతి శైలజకుమారి జిల్లా పరిషత్ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం రావడం వల్ల ఆఫీసరు ప్రమోషన్‌వైపు పోలేదంటారాయన. అందుకే సమయాన్ని వివిధ ప్రజాసంఘాల్లోనూ, సాహిత్యంలోనూ ఉపయోగించుకోవడం జరిగిందని తెలిపారు. ఆయన సతీమణి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలగా పని చేస్తున్నారు. కూతురు డాక్టర్ సుస్మిత (ఎంబిబిఎస్,ఎండి) వైద్యురాలు కావడానికి ప్రోత్సాహించారు. సేవ కార్యక్రమాల్లో పాల్గొనేలా వెన్ను తట్టి సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నిర్వహించిన హెల్త్ క్యాంపుల్లో భాగస్వామ్యం అయ్యేలా సహకరించారు. అల్లుడు డాక్టర్ విజ్ఞాన్, ఎండి చేసి వైద్య రంగంలో వున్నారు.

రఘుబాబు ఉద్యోగం చేస్తూనే ఇన్ని సంఘాల్లో పనిచేయడానికి ఆయన సతీమణి నుండి, కూతురు నుండి ఎప్పుడూ లభించిన ప్రోత్సాహమే అంటారాయన.

విద్యార్థి సంఘం నుంచి ఉద్యోగ సంఘం నాయకుడిగా ప్రస్థానం :డిగ్రీ చివరిలో గోపాల్ రెడ్డి ద్వారా ఎస్ఎఫ్ఐతో పరిచయం ఏర్పడింది. టి.నరసింహయ్య, టిసి.లక్ష్మమ్మల కుటుంబంలో నేనొక్కడినే అబ్బాయిని కాబట్టి వారు కూడా ఎప్పుడూ ఎస్ఎఫ్ఐలో చేరమని చెప్పినట్టులేరు.యూనివర్సిటీలో మాదాల వెంకటేశ్వర్లు(నెల్లూరు), రామసుబ్బారెడ్డి, కుళ్ళాయిరెడ్డి నాయకత్వంలో బాగాపని చేశారు. మొదటిసారిగా యూనివర్సిటీ ఎన్నికల్లో ఛైర్మన్‌గా రామచంద్రారెడ్డి గెలుపునకు కృషి చేశారు. అలా ఎస్ఎఫ్ఐలో రెండేళ్ల పరిచయం కర్నూలుకు వచ్చినాక కూడా ప్రజా సంఘాలతో కొనసాగింది.1985లో కాల్వబుగ్గలో ఐదురోజులు జరిగిన క్లాసులు హాజరు కావడం ఆయన జీవితాన్ని ఒక మలుపు తిప్పింది. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఉద్యోగ సంఘం ఎఐఐఇఎలో కీలకంగా పనిచేస్తున్నారు. మొదట జిల్లా సహాయ కార్యదర్శిగా, తరువాత జిల్లా కార్యదర్శిగా, ఆ తరువాత రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఉద్యోగసంఘంలో ఇప్పటిదాకా నిరంతరం సేవలందిస్తున్నారు. 1991 నుండి ఇన్సూరెన్స్ బిల్లుకు వ్యతిరేకంగా పలు ఉద్యమాలు, సంతకాల సేకరణ, ధర్నాలు, సమ్మెలు చేశారు. 2001 జులై 1,2 తేదీల్లో కర్నూలులో జరిగిన హైదరాబాదు ప్రాంతీయ మహాసభలకు కన్వీనరుగా ఉండి విజయవంతం కావడానికి కృషి చేశారు. బివి.రాఘవులు ఆ మహాసభలకు ముఖ్య అతిథిగా వచ్చారు. ఉద్యోగసంఘంలో పనిచేస్తూనే సోదర సంఘాల కార్యక్రమాలకు ముఖ్యంగా మెడికల్ రెప్స్, విద్యుత్ ఉద్యోగుల సంఘం, బ్యాంకులు, పోస్టల్ జరిగే సమ్మెల్లో పాల్గొన్నారు. ఇతర ప్రజాసంఘాల కార్యక్రమాలలోనూ ముఖ్యంగా యుఎఫ్‌బియు సమ్మెల్లో, విడిగా బెఫి, ఎఐబిఇఎ, ఎన్‌సిబిఇ సమ్మెలలోనూ పాల్గొన్నారు. విద్యుత్ రంగాన్ని విభాలుగా చేసే సమయంలో కర్నూలులోని వివిధ సెంటర్లలో వాళ్ళు చేసిన కార్యక్రమాల్లో సంఘీభావం తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్‌టిసి సమ్మెలో వారికి మద్దతుగా నిలిచి రోజూ తెల్లవారుఝాముననే బస్సులు కదలకుండా ఆపి కార్మికులకు మద్దతుగా నిలిచారు. అంగన్‌వాడీ సమ్మెలలోనూ మద్దుతుగా నిలిచారు. సాధారణ బీమాలో ఐక్య కార్యాచరణ జెఎఫ్‌టియులో నాలుగు కంపెనీల ఉద్యోగ, అధికారుల సంఘాలను సంఘటితంగా నడిపి పలు కార్యక్రమాలు, సమ్మెలు చేయడంలో సఫలమయ్యారు. ఇదంతా కూడా ఎఐఐఇఎ ఇచ్చిన పోరాట స్ఫూర్తివల్లే జరిగాయని అంటారాయన. జన విజ్ఞాన వేదికలో జిల్లా కోశాధికారిగా, జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి శాస్త్రీయ ఆలోచనలు పెంచడానికి ప్రయత్నించారు. విద్యార్థుల్లో ఆలోచనలను రేకెత్తించే చెకుముకి జిల్లా టాలెంట్ పరీక్షను ఎనిమిదేళ్లు వరుసగా నిర్వహించడంలో కీలకంగా నిలిచారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతున్న బాలోత్సవ్ కార్యక్రమాలలో తన వంతు సహకారాన్ని అందిస్తూన్నారు. ప్రస్తుతం కర్నూలు బాలోత్సవ కమిటీకి అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. కర్నూలులో హైకోర్టు కోసం, హైకోర్టు బెంచి కోసం జరిగిన పోరాటాల్లో పాల్గొని లాయర్లకు మద్దతు తెలపడం వాటిలో సంఘీభావంగా నిలిచారు. హైకోర్టు కోసం ఆయన రాసిన పాట రాయలసీమ మొత్తం పోరాటాల్లో పాడారు. ఉస్మానియా కళాశాల, కెవిఆర్ కళాశాల, క్లస్టర్ యూనివర్సిటీల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా తన సహకారాన్ని అందిస్తున్నారు. 1992 లోనే స్థానిక మిత్రులతో కలసి అంకురం అన్న కవితా సంకలనం అప్పటి స్థానిక సాహితీ స్రవంతి ద్వారా తీసుకొచ్చారు. సాహితీ స్రవంతి ఏర్పడకముందు దేశాభిమాని అన్న పేరుతో 1997 నుండి సాహిత్య సంఘంలో పనిచేశారు. 2005లో కర్నూలులో సాహితీ స్రవంతి కార్యశాలలో పాల్గొనడం మరచిపోలేనిదంటారు. 2010లో ఉమ్మడి రాష్ట్రంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటి ఏరిపడినప్పుడు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై ఇప్పటివరకూ సేవలందిస్తునే వున్నారు. కర్నూలులో నిర్వహించిన పోతులూరి వీరబ్రహ్మం సదస్సుతో పాటు వివిధ కార్యక్రమాలను మిత్రుడు కెంగార మోహన్, సాహితీ మిత్రులతో కలిసి విజయవంతానికి కృషి చేశారు.

రచయితగా, సాహితీవేత్తగా, అనువాదకుడుగా అనేక ప్రశంసలు, అవార్డులు.

పెట్టుడు రెక్కలు కథా సంపుటి, సైరా మా బళ్ళారి పాటల సంపుటి, నెర్రెలు రాయలసీమ కరువు పై కవితా సంపుటి, అద్దంలో బొమ్మలు కథా సంపుటి, అక్షరకాంతులు, విమర్శ వ్యాసాల సంపుటి వంటి పుస్తకాలు రచించారు. ఇంగ్లీష్ భాష పై వున్న పట్టుతో ముఖ్యమైన పుస్తకాలు.

నా తొలి జీవితం ఫెడల్ కాస్ట్రో, నా స్మృతిలో చెగువేర ఫెడల్ కాస్ట్రో వంటి గొప్ప రచనలను సహ అనువాదకుడిగా, అనువాదకుడిగా తెలుగులోకి తర్జుమా చేశారు. వివిధ సంకలనాల్లో కవితలు, కథలు రాసారు. పత్రికలలో కాలమిస్టుగా ప్రజాశక్తిలో చురక సంహిత 223 వారాలు పాటు, నవమల్లెతీగ మాస పత్రిక ఐదు సంవత్సరాలకు పైగా 'అవునా', ఆవిర్భవపక్ష పత్రికలో 'మరోవైపు' పేరుతో 15, నవతెలంగాణ పత్రికు 'సురుకు' శీర్షికన 90 పైగా వ్యాసాలు ఇప్పటికి రాస్తున్నారు. చెకుముకి, జెవివి ఫేస్ బుక్ వాల్‌లకు 25 సైన్సు వ్యాసాలు రాసారు.

అవార్డులు: 2017లో గురజాడ ఫౌండేషన్ అంతర్జాతీయ అవార్డు, 2019లో పండిత హీరాలాల్ స్మారక పురస్కారం, 2020 కథారచనకు వెన్నెల అవార్డు, టిజివి కళాక్షేత్రం ఉగాది పురస్కారం వంటివి అందుకున్నారు.

ఇతర రచనలు: 300 పైగా కవితలు, 80 అభ్యుదయ పాటలు, బాల సాహిత్యం 30 కథలు, వ్యంజకాలు 40 పైగా పుస్తక సమీక్షలు, సాహిత్య వ్యాసాలు 50 కి పైగా రాసారు. ప్రజాశక్తి దిన పత్రికలో 'కర్నూలు కవనం' శీర్షికన 80 మంది కవులను పరిచయం చేశారు. రేడియోలో కవితలు, కథలు పఠనం పలు పుస్తకాలకు ముందు మాటలు రాసారు. ఇలా ఉద్యోగంతో పాటు ఉద్యమం, సాహిత్య రచనలు చేయడం, కార్యక్రమాలు నిర్వహించడం, అభ్యుదయ పాటలు రాయడం, అనువాదం చేయడం వంటివి జంధ్యాల రఘుబాబుకే సాధ్యమంటారు ఆయన సహచరులు.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

శ్రీ జంధ్యాల రఘు బాబు & శ్రీమతి శైల కుమారి

13-07-1989 - 31-08-2025
సీనియర్ అసిస్టెంట్,
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్,
కర్నూలు.

ఆంగ్ల ఉపాధ్యాయురాలు,
జడ్పీ ఉన్నత పాఠశాల

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, కర్నూలు సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తూ నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రముఖ రచయిత, సాహితీవేత్త, అనువాదకులు శ్రీ జంధ్యాల రఘుబాబు గారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు...

అల్లుడు : డాక్టర్ విజ్ఞాన్, ఎంబిబిఎస్ ఎండి.

కుమార్తె : డాక్టర్ సుస్మిత, ఎంబిబిఎస్ ఎండి.

కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు

- ఆదర్శ గ్రామ సర్పంచిగా జయన్నకు ప్రత్యేక గుర్తింపు
- ఢిల్లీ గణతంత్ర దినోత్సవ వేడుకలో అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మండలంలోని బి.తాండ్రపాడు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ జయన్నకు ఉత్తమ సర్పంచిగా గుర్తింపునిస్తూ ఈ ఏడాది జనవరి 26వ తేదీన ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సర్పంచి జయన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పంచాయతీరాజ్ కేంద్ర మంత్రి రాజీవ్ రంజాన్ సింగ్ చేతుల మీదుగా ఆయనకు అవార్డును ప్రదానం చేశారు.

ఉత్తమ సర్పంచుగా గుర్తింపు

బి.తాండ్రపాడు గ్రామ సర్పంచి, కోడుమూరు నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆకుపోగు జయన్న టిడిపి సీనియర్ నాయకులు డి విష్ణువర్ధన్ రెడ్డి నేతృత్వంలో గ్రామ అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ అభివృద్ధి చేశారు. వీటికి తోడు తాగునీటి కోసం ఇంటింటికి కుళాయి నిర్మించేందుకు తగిన కృషిని చేశారు. జయన్న కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు ఆయన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన స్వయంగా కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో గ్రామాభివృద్ధికి కృషి

గ్రామంలో అభివృద్ధి ధ్యేయంగా విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నా. కేవలం ఏడాది కాలంలోనే సుమారు కోటి రూపాయలకు పైగా నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టా. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌ల ఆశయాలకు అనుగుణంగా గ్రామాన్ని మరింత అభివృద్ధి వైపుకు నడిపించాలన్నదే నా ఆకాంక్ష. అవార్డు అందుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. నా ఈ విజయానికి సహకరించిన నాయకులకు, అధికారులకు, ప్రజలకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

- ఏ.జయన్న, సర్పంచి, బి.తాండ్రపాడు.

ప్రతి అక్షరం ప్రజల పక్షం

- ఆర్‌ఐఓ జి.లాలప్ప

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా రాబోయే రోజుల్లో పత్రిక మరింత అభివృద్ధి చెందాలి. ప్రజాశక్తి ప్రజల పక్షంగా నిలిచి మరింత మెరుగైన వార్తలను సేకరించాలి. ప్రతి అక్షరం ప్రజల పక్షంగా నిలవాలనే నినాదంతో ముందుకు సాగాలని అకాంక్షిస్తున్నాం.

శాస్త్రీయ సమాజ నిర్మాణంలో ప్రజాశక్తి ఎనలేని కృషి

- జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బిడి.సుధీర్‌రాజు

ప్రజాశక్తి దినపత్రిక శాస్త్రీయ సమాజ నిర్మాణంలో ఎనలేని కృషి చేస్తోంది. అలాంటి ప్రజాశక్తి దినకపత్రిక 45వ వసంతంలోకి అడుగు పెట్టడం అభినందనీయం. ప్రజాశక్తి దినకపత్రిక రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెంది సమాజంలో అట్టడుగున నిలిచిన వర్గాలకు అండగా నిలిచేలా వార్తారచణను కొనసాగించాలి.

శాంతిభద్రతలే లక్ష్యం...

- సైబర్ క్రైమ్ నివారణకు అవగాహన
- మహిళా భద్రతకు శక్తి టీములు
- నేర నియంత్రణకు ఈ-బీట్ - ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

'జిల్లాలో ప్రజల శాంతిభద్రతలే లక్ష్యంగా పోలీసింగ్ నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయి. వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. మహిళల భద్రతకు శక్తి టీములను ఏర్పాటు చేశాం. ఈ-బీట్ ద్వారా రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించి, నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నాం' అని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా ఆయనతో ముఖాముఖి మాట్లాడారు...

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలు ఏమిటి..?

ఎస్పీ : జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించే దిశగా అనేక చర్యలు చేపడుతున్నాం. ప్రధానంగా మహిళల రక్షణపై దృష్టి సారిస్తున్నాం. ఈ మధ్యకాలంలో సైబర్ నేరాల బారినపడి ప్రజలు పెద్ద ఎత్తున మోసపోతున్నారు. వాటికి సంబంధించి కూడా ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలు చేపడుతున్నాం.

మహిళ రక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి..?

ఎస్పీ : జిల్లాలో మహిళల రక్షణ కోసం శక్తి టీములను ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. ఈఏడాది మార్చి 8న ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా ఈ టీములను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. జిల్లాలో జిల్లా హెడ్ క్వార్టర్ టీముతో సహ కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ల పరిధిలో మొత్తం ఐదు శక్తి టీములను ఏర్పాటు చేశాం. ఒక్కో టీములో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులతో కలిపి మొత్తం ఆరుగురు పోలీసులు ఉంటారు. మహిళలపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకోవడం కోసం ప్రత్యేక హాట్ స్పాట్‌లను గుర్తించి అక్కడ ఈ టీములు పనిచేస్తూ ఉంటాయి. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు వీడియోల ద్వారా మంచి, చెడు స్పర్శల గురించి అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో, ఇంటర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మంచి, చెడు స్పర్శలతో పాటు ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, ప్రేమ మోసాలు, సోషల్ మీడియా ప్రభావం, సైబర్ క్రైమ్, విద్యా ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. చిన్నపిల్లలు, డయల్ 1098కు, మహిళలు డయల్ 181కి, సైబర్ నేరాల నివారణ కోసం డయల్ 1930 నెంబర్లకు ఫోన్ చేసి సహాయం కోసం సంప్రదించాలి. శక్తి ఎస్ఓఎస్ యాప్‌లో కానీ, వాట్సప్ నెంబర్ 7993485111 నెంబర్‌లో కానీ సంప్రదించవచ్చు.

సైబర్ క్రైమ్ నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

ఎస్పీ : సమాజంలో సాంకేతికత పరిజ్ఞానంతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో వాటి పట్ల అవగాహన లేకపోవడమే. సైబర్ నేరాలను నియంత్రించడం కోసం వారిలో అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. జిల్లాలో ఈ ఏడాది రోజూ 30 నుంచి 40 కార్యక్రమాలు లక్ష్యంగా 3,084 అవగాహన కార్యక్రమాలను నిర్వహించాం. సామాజిక మాధ్యమాల్లో సైబర్ నేరగాళ్లు ఏదో ఒక ఆశ చూపి వారి వలలో పడేస్తున్నారు. ప్రజలు గుర్తుతెలియని లింకులకు, మెసేజ్‌లకు స్పందించకపోవడం ఉత్తమం. ఒటిపిలు, పాస్ వర్డులను అపరిచితులకు పంచుకోరాదు. ఈఏడాది జిల్లాలో ఇప్పటి వరకు ఈ నేరాల బారిన పడి రూ.6,23,45,180 మోసపోయారు. రూ.2,23,63,000 బాధితులకు రిఫండ్ చేయగలిగాం. రూ.2.15 కోట్లు బ్యాంకుల్లో హోల్డ్ చేశాం.

రాత్రి వేళల్లో గస్తీ నిర్వహణ ఏ విధంగా కొనసాగుతోంది..?

ఎస్పీ : ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించే విధంగా, రాత్రి వేళల్లో ఎలాంటి దొంగతనాలూ, నేరాలూ జరగకుండా ఉండేందుకు ఈ-బీట్ విధానాన్ని నూతనంగా ప్రవేశపెట్టాం. ఇందులో రోజూ 40 ఈ-బీట్‌లను ఏర్పాటు చేశాం. ఈ బీట్‌ల పనితీరును పరిశీలించేందుకు పర్యవేక్షణగా పోలీసు స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్, సిఐ పరిధిలో ఒక కానిస్టేబుల్, డీఎస్పీ పరిధిలో ఇద్దరు ఎస్ఐలు ప్రత్యేకంగా ఉంటారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే బీట్‌లో ఉండే పోలీసులు వారి ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ కూడా తీసుకొని నేరస్తుల సంచారాన్ని పసిగడుతున్నారు. తద్వారా నేరాలను ముందుగానే నివారించే అవకాశం ఉంటుంది.

నేరాల నియంత్రణకు సిసి కెమెరాలపై ఎలాంటి దృష్టి సారిస్తున్నారు..?

ఎస్పీ : నేరాల నివారణలో సిసి కెమెరాల ప్రాముఖ్యత ఎంతో విలువైంది. అందులో భాగంగా జిల్లాలో ఈఏడాది 4,985 కెమెరాలను కొత్తగా అమర్చాం. ప్రధానంగా జిల్లా సరిహద్దు, రాష్ట్ర సరిహద్దులో వీటిని ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి గ్రామంలోనూ ప్రధాన ప్రవేశ ద్వారాల్లో, అనుకూల ప్రదేశాలను గుర్తించి కెమెరాలను ఏర్పాటు చేశాం. ఆయా స్టేషన్ల పరిధిలో వాటి నిర్వహణను చేపడుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

ఎస్పీ : అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు వాహనదారులు మద్యం సేవించడం వల్ల చోటు చేసుకుంటున్నాయి. దీనివల్ల వారిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వీటిని నియంత్రించడానికి ప్రధానంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేకంగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో చేపడుతున్నాం. ఓపెన్ డ్రింకింగ్ చేసేవారిని కూడా అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తున్నాం.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ప్రయివేటు పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ
- జిల్లా విద్యాశాఖ బలోపేతానికి కృషి
- కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు
- ప్రజాశక్తితో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.శామ్యూల్ పాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.శామ్యూల్ పాల్ తెలిపారు. కార్పొరేట్ స్థాయి విద్యాబోధనకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన చేసేందుకు తగు చర్యలు తీసు కుంటున్నామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ కనబరచి పోస్టులను రాష్ట్రంలో కనివిని ఎరగని రీతిలో మంజూరు చేసిందన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా డిఈఓ శ్యామ్యూల్ పాల్ ముఖాముఖి మాట్లాడారు...

ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఎలాంటి ప్రణాళికలు చేపడుతున్నారు..?

డిఈఓ : జూన్ నెల నుండి ప్రారంభమైన విద్యా సంవత్సరం ఏడాది వినూత్నంగా ప్రారంభం కానుంది. ఏ పాఠశాలలో కూడా టీచర్ల సమస్య అన్నది లేకుండా విద్యా సంవత్సరం కొనసాగు తుంది. పాఠశాలలు తెరవగానే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేయడం జరుగుతుంది. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు డిజిటల్ పాఠాలను కూడా బోధించేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగింది.

జిల్లాకు ఎన్ని పోస్టులు వచ్చాయి?

డిఈఓ : జిల్లా కలెక్టర్ కృషివల్ల కన్వర్షన్ ఆఫ్ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్స్ కింద 251 పోస్టులు ఆదర్శ ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులుగా మంజూరయ్యాయి. సర్ప్లస్‌గా ఉన్న 97 పోస్టులను అవసరమైన ఖాళీలకు అనుగుణంగా కన్వర్ట్ చేయడం జరిగింది. కొత్తగా 86 హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 957 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 406 యస్జీటీ పోస్టులు కలుపుకుని మొత్తం 1449 మంజూరయ్యాయి. అలాగే జిల్లాలో 97 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు హై స్కూల్లు గా ఉన్నతీకరించడం జరిగింది. కాబట్టి ఈ పోస్టుల భర్తీ తో జిల్లా విద్యాశాఖ మరింత బలోపేతం కానుంది. రాష్ట్రంలో ఏ జిల్లాలో ఇన్ని పోస్టులు మంజూరు అవ్వలేదు.

ఉపాధ్యాయుల కొరతను అధిగమించినట్టేనా?

డిఈఓ : గత ఏడాది ఉపాధ్యాయుల కొరత బాగా వేధించింది. అందుకే వర్చువల్ స్టూడియో తీసుకొచ్చి అందులో నుంచి విద్యార్థులకు క్లాసులు చెప్పించే పని చేశాం. అది మెరుగైన ఫలితాలు ఇచ్చింది. అది నిరంతరం జరిగే ప్రక్రియ. ఈ వర్చువల్ నిరంతరం కొనసాగుతుంది. డీఎస్సీ నియామకాలు పూర్తయితే టీచర్ల కొరత సమస్య ఉండదు. అది కూడా యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతుంది.

మధ్యాహ్న భోజనం పథకం ఎలా నడుస్తోంది?

డిఈఓ : రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించింది. నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో మధ్యాహ్న భోజనం కొనసాగుతోంది. ఎక్కడైనా నాణ్యత లేదని మా దృష్టికి వస్తే తక్షణమే ఆ ఏజెన్సీలను రద్దుచేసి కొత్త వాళ్ళని నియమించడం జరుగుతుంది. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు.

జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు..? నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు ? దీనిపై మీ స్పందన ఏమిటి?

డిఈఓ : ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి విపరీతమైన ప్రచారం నిర్వహించరాదు. ప్రభుత్వాన్నిబంధనలను ఉల్లంఘిస్తే సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడం.

'బనకచర్ల' పేరుతో సాగునీటి ప్రాజెక్టుల నిర్లక్ష్యం

–డి.గౌస్ దేశాయి -సిపిఎం జిల్లా కార్యదర్శి

'విభజిత రాష్ట్రానికి తొలిసారిగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు 2014 ఆగస్టు 15న కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాను. అని ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు వాగ్దానం చేశాడు.' నిజమేనేమో ఆగస్టు 15 లాంటి ముఖ్యమైన రోజు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ప్రజలు నమ్మారు. ఆ ఐదు సంవత్సరాలకాలంలో ఆ రోజు తప్ప ఎప్పుడు సాగునీటి ప్రాజెక్టుల గురించి మాటవరసకైనా మాట్లాడలేదు. 2019లో తిరిగి అధికారంలోకి రావడం కోసం ఈ జిల్లాకు చెందిన కోట్ల విజయభాస్కర రెడ్డి కుమారుడు సూర్యప్రకాష్ రెడ్డిని తన పార్టీలో చేర్పించుకొంటున్న సందర్భంగా ఐదేళ్లుగా ఏమి చేయని వ్యక్తి ఎన్నికల కోసం హడావుడిగా కోడుమూరులో ప్రాజెక్టుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఆ తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఊసే ఎత్తలేదు. అందుకోసమే ఈ జిల్లా ప్రజలు బుద్ధిచెప్పారు. తిరిగి రెండవ సారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాది గడిచినా తాను గతంలో ఇచ్చిన వాగ్దానాన్ని మాట మాత్రం కూడా ప్రస్తావించకుండా ఈ జిల్లా ప్రజలు సాగునీటి ప్రాజెక్టులు మరిచిపోవడానికి అందని ద్రాక్షపండును (బనకచెర్లపేరుతో) చూపించి మరొకసారి రాయలసీమ ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారు. కర్నూలు జిల్లాకు కూత వేట దూరంలో ఉన్న నీటిని వినియోగించుకొని రూ.10 వేల కోట్లు కేటాయిస్తే జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి అవ్వడానికి అవకాశం ఉన్నా దానికి సిద్ధపడని వ్యక్తి రూ.80 వేల కోట్లు ఖర్చుపెట్టి గోదావరి జలాలను తీసుకొచ్చి జిల్లాలోని భూములకు సాగునీరు అందిస్తాను అని చెబితే నమ్మాల్నా, చంద్రబాబు ఎవరి చెవ్వుల్లో పూలు పెడుతున్నారు.

ఆర్డిస్ కుడి కాలువ నిర్మాణం ఎందుకు ఆగింది?

రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ అనేది తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా, ఎపిలోని కర్నూలు జిల్లా, కర్నాటకలోని రాయచూర్ జిల్లాలో తుంగభద్ర నదిపై ఉన్న ఒక సాగునీటి ప్రాజెక్టు. ఇది అంతర్ రాష్ట్ర బ్యారేజీ. 1956లోనే కర్నాటక రాష్ట్రంలో ఎడమవైపు ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యింది. దాదాపు 70 సంవత్సరాలు గడుస్తున్నా కుడికాల్వ నిర్మాణం జరగలేదు. 2013లో 956 కృష్ణా జల వివాదాల ట్రిబునల్-2 కర్నూలు జిల్లాలో ఆర్డిఎస్ కుడికాల్వకు 4 టిఎంసి నీటిని కేటాయించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 1985.42 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. 2019 జనవరి 19లో అప్పటి టిడిపి ప్రభుత్వం జిఓ నంబరు-76ను జారి చేసింది. టెండర్లు కూడా పూర్తి చేసింది. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో కోసిగి మండలం సాతనూరు వద్ద తుంగభద్ర నదికి ఆర్డిఎస్ ఆనకట్ట వద్ద హెడ్ స్లూయిస్ మాత్రమే కట్టారు. నిధులు ఇవ్వకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయి. 0.7 శాతం పనులు చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాలకు సాగు, పలు గ్రామాలకు తాగునీరు అందుతుంది. ప్రాజెక్టులో భాగంగా కోసిగి, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు, గోనేగండ్ల మండలం చిన్నమరివీడు వద్ద రిజర్వాయర్లు నిర్మించాలి. ప్రతిపక్షంలో ఉండగా నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో ఈ ప్రాజెక్టు త్వరతగతిన పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చినా పనులు మొదలు పెట్టలేదు. 2025-26 బడ్జెట్లో ప్రత్యేకంగా కేటాయింపులు లేవు. బడ్జెట్టులో నిధులు కేటాయించే బాధ్యత ఎవరిది? మాట ఇచ్చిన కూటమి నాయకులు నిధులు ఎందుకు కేటాయించలేక పోయారు?.

నిధులులేక ఆగిపోయిన వేదావతి ఎత్తిపోతల ప్రాజెక్టు

కర్నూలు జిల్లాలో ప్రజలు వలసల నివారణ కోసం ఉపయోగపడే ప్రాధాన్యత గల ప్రాజెక్టు వేదావతి ప్రాజెక్టు. వేదావతి ప్రాజక్టు ద్వారా 8.29 టిఎంసిలు నీటిని వినియోగించుకొని మొలగవెల్లి, హాలహర్వి రెండు చోట్ల రిజర్వాయర్లు నిర్మిస్తే 21 కిలో మీటర్ల గ్రావిటి ద్వారా ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 195 గ్రామాలకు, 6 లక్షల మందికి తాగునీరు అందించవచ్చు. వేదావతి నది నుంచి స్టేజ్-1 పంప్ హౌస్, హంద్రీనీవా కాలువపై మద్దికెర సమీపంలో స్టేజ్ - 2 పంప్ హౌస్ నిర్మించి 8 టిఎంసిలు తీసుకోవాలని లక్ష్యం. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 4800 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,942. 80 కోట్లు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 2019లో ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2019 జనవరి 29న నాటి టిడిపి ప్రభుత్వం జిఓ నంబరు -77 జారీ చేసి టెండర్లు పూర్తి చేసింది. మెఘా కంపెనీ టెండర్లు పొందింది.

గుండ్రేవుల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న నారాచంద్రబాబునాయుడు , జిల్లా అగ్రనేతలు (ఫైల్)

వైసిపి ప్రభుత్వం వచ్చాక వేదావతి నది నుంచి కొంత వరకు పైప్‌లైన్, హంద్రీనీవా కాలువపై స్టేజ్-2 పంప్ హౌస్ పనులు మొదలు పెట్టారు. దాదాపు 10.98 శాతం పూర్తి చేసి రూ.120 కోట్లు ఖర్చు చేస్తే వైసిపి హయాంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పనులు ఆగిపోయాయి. ఇప్పటికీ పూర్తికాని భూసేకరణ, మొదట రూ.350 కోట్లు ఖర్చుచేస్తే మొలగవెల్లి రిజర్వాయర్ పూర్తిచేస్తే 18వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ప్రతిపక్షంలో ఉండగా.. కరువు, వలసలు నివారణకు మా ప్రభుత్వం రాగానే పనులు మొదలు పెడతామని ఆలూరు సభలో నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుతం సీఎం చంద్రబాబు, యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. 2025-26 బడ్జెట్లో ప్రత్యేక కేటాయింపులు లేవు. ఇది కూటమి ప్రభుత్వం తీరు.

పాలకుల నిర్లక్ష్యంతో అడుగు ముందుకు పడని గుండ్రేవుల నిర్మాణం :

కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం, గుండ్రేవుల గ్రామం దగ్గర తుంగభద్ర నదిపై 20 టిఎంసిల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మించాలని లక్ష్యం. ఈ రిజర్వాయర్ నిర్మిస్తే కర్నూలు, కడప జిల్లాలలో సాగునీరు, తాగునీరు అందించడానికి ఉపయోగపడే ప్రాజెక్టు. దీనికి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 20 టిఎంసిల నిఖర జలాలను కేటాయించింది. ఈ ప్రాజెక్టు నిర్మించడానికి రూ.2,890 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఉమ్మడి ఎపి రాష్ట్రం చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి సర్వే, డిపిఆర్ తయారి కోసం నిధులు.. ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఫిబ్రవరి 21న అప్పటి టిడిపి ప్రభుత్వం జిఓ నంబరు-154 జారీ చేసింది. కేసీ కెనాల్ నిఖర జలాలు 31.90 టిఎంసిలు నిల్వ చేసుకోవాలని.. ఈ జలాశయం అవసరమని రిటైర్డ్ ఇఇ సుబ్బారాయుడు ప్రతిపాదించారు. రాష్ట్ర విభజన తరువాత వచ్చిన టిడిపి ఐదేళ్లు పట్టించుకోలేదు. 2019 ఎన్నికల ముందు ఓట్ల కోసం హడావుడిగా జిఓ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక అంతర్ రాష్ట్ర సమస్య అని పక్కన పెట్టారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు గూడూరు సభలో చంద్రబాబు, పాదయాత్రలో నారా లోకేష్ కూటమి ప్రభుత్వం రాగానే నిధులు కేటాయించి పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. 2025-26 బడ్జెట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కొరకు నిధులు కేటాయించలేదు. నిధులు కేటాయించకుండా ప్రాజెక్టులు ఎలా పూర్తవుతాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలైన ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తీసుకొని రావాలి.

హంద్రీనీవా పత్తికొండ జలాశయం కుడి, యడమ కాల్వలు:

హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నది హక్కు. పత్తికొండ (పందికోన) జలాశయం నుంచి కుడి ఎడమ కాలువ కింద పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 65 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. కాల్వలు, పిల్ల కాల్వల పనులు అసంపూర్తిగా ఉండడంతో 20 వేల ఎకరాలకు కూడా నీరు ఇవ్వడం లేదు. రూ.208 కోట్లు ఇస్తే అదనంగా 45 వేల ఎకరాలు సాగులోకి వస్తుంది. నాడు వైసిపి నేడు టిడిపి కూటమి ప్రభుత్వాలు ఒక్క పైసా ఇవ్వలేదు. చిత్తూరు జిల్లా కుప్పంకు కృష్ణా జలాలు తీసుకువెళ్లాలని రూ.3,500 కోట్లతో విస్తరణ, లైనింగ్ పనులు చేపట్టారు తప్ప కరువు నివారించే పత్తికొండ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు పూర్తికి ఒక్క పైసా ఇవ్వలేదు. విస్తరణ పనుల్లో భాగంగా 18 తూములు ఏర్పాటు చేయాలని కర్నూలు జిల్లా రైతులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పత్తికొండ దేవనకొండ మండలాల్లో పిల్ల కాల్వల నిర్మాణం లేకపోవడంతో నీళ్ళు ఉన్నా వినియోగించుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం పిల్ల కాల్వల నిర్మాణాన్ని చేపాట్టాలి. కర్నూలు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి బలమైన ప్రజా ఉద్యమం రావాల్సిన అవసరం ఉన్నది.

వైద్య రంగంపై సమగ్ర సమీక్ష అవసరం

– ప్రజారోగ్య వేదిక నాయకులు బిఎల్ఎన్.ప్రసాద్‌శర్మ

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రనిధి కర్నూలు

'వైద్యం సామాన్యునికి అందుబాటులో ఉండాలి. పెరిగిన టెక్నాలజీ దృష్ట్యా అధునాతన సాంకేతిక పరికరాలను ప్రభుత్వ ఆస్పత్రులతో ప్రభుత్వమే కొని ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం, కేంద్రం ప్రభుత్వ తెచ్చిన వెల్‌సెంటర్స్ పద్ధతిని పటిష్టంగా అమలు చేయాలి. ఫారిన్ తరహాలో రెఫరల్ సిస్టమ్ రావాలి. వైద్యం పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి. అన్నింటిని మించి వైద్య రంగంపై సమగ్ర సమీక్ష చేయాలి. ఇవన్ని అమలు కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యానికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలి.' అని కర్నూలు ప్రజారోగ్య వేదిక నాయకులు బిఎల్ఎన్.ప్రసాద్‌శర్మ పేర్కొన్నారు. ఆయన మాటల్లో...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. ప్రధానంగా మందులు ఉండటం లేదు. సిబ్బంది నియామకాల్లేవు. సీజనల్ వ్యాధులు బాగా పెరుగుతున్నాయి. తగిన మందులు లేవు. వైద్యులు, నర్సులు, సబ్‌స్టాఫ్ చేస్తున్న కృషికి సపోర్టుగా మందులు, పరికరాలు అందుబాటులో ఉంచాలి. బీపీ ఆపరేటర్లు, ఇసిజి మిషన్లు లేవు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్యం చేసే వారి నుంచి పైకి రెఫర్ చేసే సిస్టమ్ సరిగ్గా లేదు. మొబైల్, సూపర్ స్పెషాలిటీ సౌకర్యం కల్పించాలి. విజిట్స్ పెట్టాలి. ప్రత్యేక క్లీనిక్ నడపాలి. నెలకు ఒక సారి సర్జన్, ఫిజీషియన్ విజిట్ చేయాలి. ఇలాంటి స్థాయి వైద్యులు లేని చోట తప్పక నియమించాలి. జిల్లాలో రక్తహీనత పెరిగింది. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. మహిళలకు ప్రత్యేకించి రాపిడ్ టెస్టులు చేపించాలి. రక్తంలో హిమోగ్లోబిన్ సరైన స్థాయిలో ఉండేలా చూడాలి. ప్రభుత్వ వైద్యం బలోపేతానికి రిటైర్డ్ వైద్యులతో కమిటీ ఏర్పాటు చేయాలి. కలెక్టర్లు, నిష్ణాతులైన వైద్యులతో కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ వైద్యశాలలో ఎమర్జెన్సీ, క్యాజువాలిటీలో ఐదు రకాల సౌకర్యాలు ఉండాలి. సర్జికల్, మెడికల్, గైనిక్, సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలతో పాటు డిఎం స్థాయి వైద్యాధికారి పర్యవేక్షణ ఉండాలి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పడకలకు తగిన సిబ్బంది లేరు. ప్రధానంగా ఎమర్జెన్సీలో యుద్ధప్రాతిపదికన సౌకర్యాలు కల్పించాలి. తమిళనాడు, కేరళ తరహాలో మారుమూల ప్రాంతాలకు కూడా వైద్యం అందించేలా యంత్రాంగం ఉండాలి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వైద్యరంగంలో మార్పులు రాకూడదు. స్థిరమైన విధానం ఉండాలి. టిబి వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. పౌష్టికాహార లోపం, ఆ జబ్బు వచ్చిన వారిపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల తగ్గడం లేదు. ప్రయివేటు వైద్యశాలలో ఆరోగ్యశ్రీ సేవలు బాగునప్పటికీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో అవినీతి పెరిగింది. దానిని అరికట్టాలి. ప్రభుత్వం కంటి వైద్యంపై ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలి. హిమోఫిలియా మందులు అందుబాటులో ఉంచాలి. వలసలు వెళ్లే వారి దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వారికి మందులు అందించాలి. మారిన కాలంలో గుండె జబ్బులు, బీపీ, షుగర్ లాంటి జబ్బులు దరిచేరకుండా ఉండాలంటే వ్యాయామం, పౌష్టికాహారం, రోగ నివారణ చర్యల మీద అవగాహన పెంచుకోవాలి. వైద్యం కంటే ముందస్తు చర్యలు తీసుకోవడం ఉత్తమం. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పౌష్టికాహార వస్తువులను పంపిణీ చేయాలి. వైద్యం మానవుని జీవన సరళిలో ప్రధానంగా మారింది. గతంతో పోలిస్తే వైద్యులపై ఆధారపడే జనాభా పెరిగింది. శ్రమతగ్గడం, టెక్నాలజీ పెరిగి వృత్తిపరంగా ఒత్తిడి పెరగడం పౌష్టికాహార లోపం, ఆహారంలో మార్పులు ప్రధాన కారణం. వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాలని గతంలో డబ్ల్యుహెచ్ఓ చెప్పింది. హాలోపతి, హోమియోపతి, ఆయుర్వేదం లేదా ఆయుష్, యునాని ఇతర ప్రభుత్వం గుర్తించిన వైద్యం, వైద్యులు అందుబాటులో ఉన్నారు. ప్రపంచీకరణ తర్వాత ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తగ్గింది. ఫ్యామిలీ డాక్టర్ విధానం ఉండాలి. ఎవిడెన్స్ మెడిషన్ పద్ధతి అనేది వచ్చింది. ఒక డాక్టర్ దగ్గరకు రోగి వచ్చినప్పుడు పూర్వాపరాలు, జీవన శైలి తెలుసుకోవాలి. అది తగ్గింది. 90 శాతం మంచి వైద్యం అందించే వైద్యులు వచ్చారు. వ్యాపార ధోరణి ఉన్నా రోగికి మేలు చేయాలనే చూస్తున్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ పెరిగింది. ప్రభుత్వం దానిని కొనలేని స్థితిలో ఉంది. పెట్టుబడిదారులు కొంటున్నారు. రోబోటిక్ యంత్రాలు వచ్చాక ఆధిపత్య వైద్యం పెరిగింది. గతంలో సోషల్ ఓరియంటేషన్ పద్ధతి ఉండేది. సామాజిక దృక్పథం, ఛారిటీలతో నడిచే వైద్యకేంద్రాలకు గుర్తింపు పోయింది. ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలి. ప్రభుత్వ వైద్యశాలలను పటిష్ట పరచాలి. ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ ద్వారా ప్రివెంటివ్, ప్రమోషన్ గుండెకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలి. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రయివేట్ ఆస్పత్రులపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలి. ఫారిన్ తరహాలో రెఫరల్ సిస్టమ్‌ను తీసుకురావాలి. మందులు సామాన్యులకు ఉచితంగా ఇవ్వాలి. రోగనిరోధక చర్యలు చాలా ముఖ్యం. వచ్చిన రోగికి ప్రథమంగా చికిత్స చేయాలి. వైద్యం పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన పెంచాలి. డయాబెటిక్ మందుల ధరలు తగ్గించాలి. మూడు నెలలకు వచ్చే మందులకు రూ.2500 దాకా ధర ఉంది. వాటిని రూ.5 నుంచి 600లకు తగ్గించాలి. కర్నూలు జిల్లాలో 35 పీహెచ్సీ కేంద్రాలు, కోడుమూరు ఎమ్మిగనూరు పత్తికొండ మూడు కో లోకేటెడ్ కేంద్రాలు, జిల్లాలో అర్బన్ హెల్త్ కేంద్రాలు 28 వాటిలో కర్నూలు 18 ఆదోని ఆరు ఎమ్మిగనూరు నాలుగు. జిల్లాలోని పీహెచ్సీ కేంద్రాలలో మూడు వైద్యుల పోస్టులు, అర్బన్ హెల్త్ కేంద్రాలలో ఆరు వైద్యుల పోస్టులు ఖాళీలు ఉన్నాయి.

పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పేర్కొన్నారు. ప్రజాశక్తి దినపత్రిక 44 సంవత్సరాలు పూర్తి చేసుకుని 45వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ప్రజాశక్తి యాజమాన్యానికి, సిబ్బందికి, పాఠకులకు శ్రేయోభిలాషులకు ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని పాణ్యం నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.200 కోట్లతో సంక్షేమం సాగుతోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ ప్రగతికి బాటలు వేశామన్నారు. నియోజకవర్గంలోని 117 మందికి రూ.1.40 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేసి వైద్య సాయం అందించినట్లు తెలిపారు. ఓర్వకల్లు సిహెచ్‌సి అభివృద్ధికి రూ.10 లక్షలు, చిన్నటేకూరు ఎపిఎస్‌డబ్ల్యూఆర్ ఐఐటి అకాడమీ అభివృద్ధికి రూ.10 లక్షలు సిఎస్ఆర్ నిధులు మంజూరు అయినట్లు చెప్పారు. రూ.1.92 కోట్లతో నియోజకవర్గంలోని సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు రూ.2.90 కోట్లతో 126 మినీ గోకులం షెడ్ల నిర్మాణం పూర్తి అయినట్లు పేర్కొన్నారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16 వార్డుల్లో రూ.41.22 కోట్లతో సిసి రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ నుంచి రూ.8.37 కోట్లతో రోడ్లు, బ్రిడ్జిల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎపిఐఐసిలో రూ.45 లక్షలతో గ్రావెల్ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. రూ.15.94 కోట్ల పంచాయతీ రాజ్ నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. ఇండ్రస్టియల్ హబ్ మౌలిక వసతుల కల్పన కోసం రూ.2,786 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అలగనూరు జలాశయం మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.37 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గడివేముల బైపాస్ కోసం రూ.2 కోట్లతో కార్యాచరణ చేపట్టామన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.3.60 కోట్లు మంజూరు చేసిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

క్విట్ నాన్ టీచింగ్ వర్క్స్.. సేవ్ స్కూల్స్...

- కె.సురేష్‌కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

జాతీయోద్యమ కాలంలో ఆగస్టు 8, 1942న ప్రారంభమైన చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం గురించి అందరికీ తెలిసిందే. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో క్విట్ నాన్ టీచింగ్ వర్క్స్ ఉద్యమం చేపట్టాల్సిన పరిస్థితులు దాపురించాయి. బదిలీలు, ప్రమోషన్ల ప్రహసనం పూర్తయి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ సగానికి పైగా ఉపాధ్యాయులు ఏదో ఒక రూపంలో పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. డీఎస్సీ పరీక్షలు పూర్తయినా నియామక ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇలాంటి కారణాల వల్ల ఒక వైపు ఉపాధ్యాయుల లేమీతో పాఠశాలలు మూలుగుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ఉపాధ్యాయుల బోధనేతర పనులతో విద్యార్థుల చదువు చట్టుబండలవుతోంది. పదేళ్లకోసారి జరిగే జనాభా లెక్కల సేకరణ, ఐదేళ్లకోసారి జరిగే సాధారణ ఎన్నికల విధులు మినహా ఎలాంటి బోధనేతర పనులు ఉపాధ్యాయులతో చేయించరాదని విద్యాహక్కు చట్టం ఆధారంగా ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతున్నారు. ఫలితంగా పాఠశాలల్లో బోధన మినహా బోధనేతర పనులే ఉపాధ్యాయ వృత్తిగా మారింది. 'అడిగే వాడికి చెప్పేవాడు లోకువ' అన్నట్లు అడిగిన సమాచారాన్ని పదే పదే రోజూ అడగడం, స్పందించకపోతే చర్యలు తీసుకుంటామని నియంతృత్వ పోకడలతో బెదిరించడం, పాలకుల ప్రాపకం కోసం పనిచేసే అధికారులకు షరా మామూలయింది. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు దగ్గర నుంచి ప్రతి విషయమూ ఆన్‌లైన్ కావడం వల్ల ఆన్‌లైన్ పనులు వివిధ కారణాల వల్ల, టెక్నికల్ సమస్యల వల్ల ఆలస్యం కావడం వంటి కారణాలతో బోధన సమయం హరించుకుపోతోంది. సిబ్బంది కేడర్ స్ట్రెంగ్త్, విద్యార్థుల స్ట్రెంగ్త్ పర్టికులర్స్ పంపించడం నిత్య కృత్యమైంది. కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు గిన్నిస్ రికార్డుల కోసం పడుతున్న తపన 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు'గా ఉంది. 'యోగాంధ్ర డే' కోసం ప్రభుత్వం, అధికారులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. జూన్ 21న కార్యక్రమం జరిగితే వారానికి ముందు పది రోజుల పాటు అన్ని పాఠశాలల్లో బోధన సమయం హరించుకుపోయింది. యోగా ప్రాక్టీసు, యోగా డే ఏర్పాట్లు రోజూ ఫొటోలు అప్‌లోడ్ చేయడం వంటి పనులకే సమయమంతా సరిపోయింది. జులై 10న జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు కూడా అధికారులు చేసిన ఒత్తిడి విద్యార్థులను బోధనకు దూరం చేయడమే కాక ఉపాధ్యాయులను మరింత ఒత్తిడికి గురి చేసింది. విద్యార్థుల రిజిస్ట్రేషన్, ఎస్ఎంసి సభ్యులు, తల్లిదండ్రుల రిజిస్ట్రేషన్, విట్‌నెస్ ఆఫీసర్ రిజిస్ట్రేషన్, గెస్ట్‌ల రిజిస్ట్రేషన్, గ్రీన్ పాస్‌పోర్టు అంటూ నానా యాగీ చేసిన అధికారులు సదరు సమావేశం జరిగిన రోజు వీడియోలు, ఫొటోలు, విట్‌నెస్ కాపీలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, తర్వాత అవి సరిగా లేవంటూ వాటి కోసం వారం రోజులపాటు ఉపాధ్యాయులందరినీ అదే పనిలో పెట్టడం ఇదంతా బోధన కుంటుపడేట్లు చేయటమే. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్ల పంపిణీ పాఠశాల ప్రారంభమైన వెంటనే జరగాలని ఒక వైపు చెబుతూనే ఆన్‌లైన్ సర్వర్ పనిలో లేకపోవడం వల్ల నెల తర్వాత వెంటనే ఆన్‌లైన్ పని చేయాలంటూ ఒత్తిడి పెట్టడం, సన్న బియ్యం పంపిణీ నెపంతో డొక్కా సీతమ్మ ఎండిఎం యాప్‌లో ప్రతి బియ్యం ప్యాకెట్ స్కాన్ చేయాలనే పనులతోనే సమయమంతా సరిపోతుంది. ఇంకోవైపు ఉన్న కొద్దిమంది ఉపాధ్యాయుల్లో కొంతమందికి లీడర్‌షిప్ శిక్షణ, ఎఫ్ఎల్ఎన్ శిక్షణల పేరుతో పాఠశాలకు రాకుండా నియంత్రించడం కేంద్ర ప్రభుత్వం కర్మయోగి శిక్షణ పేరుతో ఆన్‌లైన్‌లో ఇస్తున్న ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ శిక్షణ ప్రతి టీచరు పూర్తి చేయాలని చెప్పి 18 కోర్సుల కోసం గంటలకొద్దీ ఆన్‌లైన్‌లోనే గడపాల్సిన పరిస్థితి. అది పూర్తి చేయకపోతే చర్యలు ఉంటాయని బెదిరింపుల వల్ల ఉపాధ్యాయులు మానసికంగా కూడా నలిగిపోతున్నారు. విద్యార్థులకు చైల్డ్ ఐడి, పెన్ ఐడి, అపార్ ఐడి పేరుతో గంటలకొద్దీ సమయం వృథా అవుతోంది. వీరికి ఆధార్ నెంబర్ ఉండనే ఉంది. యాప్‌ల గోల తగ్గిస్తామన్న ప్రభుత్వం 'లీప్' పేరుతో ఒకే యాప్ పెట్టినప్పటికీ అన్ని యాప్‌లూ అందులోనే ఉంచి మరింత భారం పెంచడం విశేషం. ఈ నేపథ్యంలో విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైంది. అదే సమయంలో తల్లికి వందనం పేరుతో విద్యార్థులందరికీ రూ.వేలు పంపిణీ చేయడం వల్ల సహజంగానే తల్లిదండ్రుల చూపు వీధి బడి నుంచి ప్రయివేట్ పాఠశాల వైపు పడుతుంది. అలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నానాటికీ తగ్గిపోయి ప్రభుత్వ పాఠశాల రంగం కునారిల్లిపోతోంది. 1942 ఆగస్టు నెలలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ ఆగస్టు నెలలో 'క్విట్ నాన్ టీచింగ్ వర్క్స్' లేదా 'క్విట్ మొబైల్' పేరుతో ఉద్యమించకపోతే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకమే..!